# దోపిడీ వర్గాలున్నంతవరకు - వర్గపోరాటం సాగుతూనే వుంటుంది

# అక్టోబర్ విప్లవ పతాకం ఎగురుతూనే వుంటుంది

విశ్వం

**1917** రష్యా అక్టోబర్ విప్లవం అఖిల మానవాళికి ఆశాజ్యోతిగా, నిలచింది. మానవజాతి చరిత్రలో పెనుమార్పుకి సంకేతంగా నిలిచింది. పాతపైన క్రొత్త చేసిన ప్రళయరావమది. కులక్ భూస్వామ్య, రాజరిక పెట్టుబడిదారీ వ్యవస్థను ఒక కుదుపు కుదిపిన విప్లవమది.

మనిషిని మనిషి దోచే దోపిడీ వ్యవస్థలకు గోరీ కట్టి శ్రామికవర్గ అధికారాన్ని, కష్టజీవుల రాజ్యాన్ని స్థాపించిన మహా విప్లవమది. మానవ జాతి సలిపిన అనేక భీకర పోరాటాల పరంపరల మూలంగా సంభవించిన పరిణామాలలో ఒకా నొక గుణాత్మక పరిణామమది. ఈ పరిణామం మానవేతిహాసంలో ఒక పెద్ద మైలురాయి. ఇది మానవజాతి అభివృద్ధి సమాజాభివృద్ధి క్రమంపైన కలిగించిన ప్రభావాలూ అసామాన్య మైనవీ,

చూడగల కళ్ళున్న గుడ్డివాళ్ళూ, వినగల చెవులున్న చెవిటివాళ్ళూ, సత్యాన్ని అంగీకరించలేకపోవచ్చు. కొట్టివేయవచ్చు - నిరంకుశత్వమని, పెడబొబ్బలు పెట్టవచ్చు. వారింకా కమ్యూనిస్టులు నాశనమైపోవాలనీ, లెనిన్ పెట్టవచ్చు. అసలు ఈ కళ్ళున్న గుడ్డివాళ్ళు, చెవులున్న చెవిటివాళ్ళూ, పెట్టుబడిదారులూ, సామ్రాజ్యవాదులూ వారి తాబేదారులూ, వారి బూర్జువాలే.

రష్యాలో ప్రజాతంత్ర విప్లవోద్యమ నిర్మాణం కోసం, దానిని జరపడం కోసం, లెనిన్, స్టాలిన్‌లు చేసిన కృషి అపారమైనదేగాక ధోరణులను సిద్ధాంతరీత్యా, రాజకీయంగా, ఆచరణాత్మకంగా ఓడించారు. అకుంఠితమైన పోరాటాలను సాగించారు.



ప్రపంచ శ్రామికవర్గ విప్లవకారులకు మార్గదర్శిగా సమూలమైన మార్పు కోసం

క్రమంపైన, అద్భుతమైనవి.

బుర్ర వున్న స్వార్ధ పరులూ, నిప్పులాంటి ఈ చారిత్రక చండామార్కమనీ, అలగా జనపు అరాచకమనీ చావాలనీ, స్టాలిన్ మాడి మసవ్వాలనీ శాపనార్ధాలు బుర్రవున్న స్వార్ధపరులు ఎవరు? కులక్ భూస్వాములు, ప్రభావంలో వున్న కొంత మంది మేధావులూ,

విజయవంతం చేయడం కోసం, సోషలిజాన్ని అమలు బహుముఖమైనది. అన్ని రకాల అవకాశవాద పార్టీ లోపలా, బయటా అచంచలమైన

## నిరంతర సంఘర్షణ :

**ఒకటి :** 20వ శతాబ్ద ప్రారంభం నుండి రష్యాలో వున్న వివిధ మార్క్సిస్టు గ్రూపులను, సర్కిళ్ళను ఒకే ఒక వేదిక పైకి తెచ్చారు. అఖిల రష్యా కమ్యూనిస్టు పార్టీగా ఏర్పాటు చేయడం కోసం రాజీలేని పోరాటం సాగించారు, 1902లో రష్యా కమ్యూనిస్టులు. ఏం చేయాలో, ఎక్కడ ప్రారంభించాలో అన్నదానిపై పుట్టుకొచ్చిన అనేక కుక్కగొడుగు సిద్ధాంతాలపై కామ్రేడ్ లెనిన్ నాయకత్వాన రష్యాలో విప్లవకారులు తిరుగులేని పోరాటం సాగించారు. ఆర్థికవాదం, యాదృచ్ఛికవాదం, వర్గ రాజకీయాలక్కర్లేదు, తోకపుచ్చుకు నడపటం, సిద్ధాంతరాహిత్యం, నిర్మాణం అక్కర్లేదనడం - లాంటి అనేక ధోరణులతో కామ్రేడ్ లెనిన్ అకుంఠిత పోరాటం చేశాడు. అసంఘటితంగా - చెల్లాచెదురుగా వున్న విప్లవ శక్తులను ఒకే నిర్మాణంలోకి తెచ్చి ఒకే త్రాటిపై నడిపించాడు. రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) స్థాపించాడు.

**రెండు :** 1905 నాటికి రష్యాలో మొదటి విప్లవం బ్రద్దలయి ఓటమికి గురయింది. ఈ ఓటమిని ఆసరా చేసుకొని తలెత్తిన ఓట్జోనిస్టుల అతివాద అవకాశవాదానికి వ్యతిరేకంగానూ, మరొకవైపున కార్మికోద్యమంలో తలెత్తిన ఆర్థిక వాదం, వ్యక్తిగత హింసావాదాలకు వ్యతిరేకంగా లెనిన్-స్టాలిన్‌లు రాజీలేని పోరాటం చేశారు. 1905 విప్లవం, 1917 అక్టోబరు మహా విప్లవానికి రిహార్సలు లాంటిదని లెనిన్ అభివర్ణించాడు.

1905 - 1907 విప్లవం ఓటమికి గురై నప్పుడు జార్ ప్రభుత్వం కొన్ని సంస్కరణలను ప్రవేశపెట్టింది. (మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం తర్వాత, శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటం తర్వాత కూడా భారత పాలకులు అదే బాణీలో సంస్కరణలను ముందుకు తెచ్చారు) ఇలాంటి సందర్భాలలో కమ్యూనిస్టు విప్లవకారులు "పాలసీలో పొరబడకుండా వుండాలంటే విప్లవవాది అయి వుండాలేగాని సంస్కరణవాది కాకూడదు" అని లెనిన్, జారు ప్రభుత్వం ప్రకటించిన సంస్కరణల పట్ల కమ్యూనిస్టుల వైఖరిని వివరించాడు.

**మూడు :** 1914–17 మొదటి ప్రపంచ యుద్ధకాలంలో రెండవ ఇంటర్నేషనల్ పార్టీలన్నీ మాతృదేశ రక్షణ అన్న వైఖరి తీసుకొని తమ తమ దేశాల సామ్రాజ్యవాదులను, జార్ యుద్ధ చర్యలను బలపరచి నేషనల్ ఛావనిస్టులు (జాతీయ దురహం కారులు)గా మారడాన్ని లెనిన్–స్టాలిన్‌లు తీవ్రంగా ప్రతిఘటించారు. 1917 మహోన్నత రష్యా విప్లవ విజయం తర్వాత ట్రాట్స్కీయిస్టుల శాశ్వత విప్లవ సిద్ధాంతంతో దృఢమైన పోరాటం సాగించారు. "ఒక్క దేశంలో సోషలిజం నిలబడదు, ప్రపంచ వ్యాపితంగా విప్లవం చేస్తే తప్ప" అనే ట్రాట్స్కీ ముఠావాదనలను తుత్తునియలు చేస్తూ రష్యాలో సోషలిస్టు వ్యవస్థను స్థాపించడం, దానిని నిలబెట్టు కోవడం సాధ్యమని నిరూపించారు.

**నాలుగు :** 1924లో లెనిన్ అకాల మరణంతో రష్యా కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) కుంగిపోలేదు. కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన శ్రామికవర్గ నియంతృత్వ సూత్రాన్ని దృఢంగా అమలుజరిపి, రష్యాను దోపిడీ, పీడనలేని రాజ్యంగా తీర్చిదిద్దుకున్నారు.

ఈ సోషలిస్టు విప్లవాన్ని భగ్నం చేసే కుట్రలు పార్టీ లోపల నుండీ, బయట అభివృద్ధి నిరోధకుల నుంచీ ప్రారంభమయ్యాయి. సమిష్టి వ్యవసాయ ఉద్యమాన్ని వ్యతిరేకించే కులక్‌ల, అధిక లాభాపేక్షా పరుల ప్రతీఘాతుక చర్యలను పేద, మధ్యతరగతి రైతులు ప్రతిఘటించారు. వారి కుట్రలను భగ్నం చేసి సమిష్టి వ్యవసాయోద్యమాన్ని దృఢంగా ముందుకు నడిపించారు. పుష్కలంగా ఆహారధాన్యాల ఉత్పత్తిని సాగించారు.

అలాగే కొన్ని పరిశ్రమల్లో, బొగ్గు గనుల్లో పెట్టుబడిదారీ శక్తులు విధ్వంస కార్యక్రమాలు సాగించే కుట్రలు చేశారు. విదేశీ పెట్టుబడిదారులు, రష్యన్ పెట్టుబడిదారులు, విదేశీ సైనిక గూఢచారులు కలసి, రష్యా సోషలిస్టు పరిశ్రమలను విచ్ఛిన్నం చేసి పెట్టుబడిదారీ పునరుద్ధరణ చేయాలనే లక్ష్యంతో ప్రతీఘాతుక చర్యలకు పూనుకున్నారు. రష్యా కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) స్టాలిన్ నాయకత్వంలో ఈ కుట్రదారులను పసిగట్టింది. కార్మికవర్గాన్ని జాగరూకులను చేసింది. ఈ విప్లవ ప్రతీఘాతకులను విచారించి తగిన శిక్షలను విధించింది. పరిశ్రమలలో పెట్టుబడిదారీ నిపుణులపై ఆధారపడకుండా కార్మికవర్గ అనుచరుల నుంచి వచ్చిన యువకులను సాంకేతిక విద్యలో తర్ఫీదు నివ్వాలని స్టాలిన్ సూచన చేశాడు.

విప్లవ ప్రతీఘాతకులయిన స్వదేశీ పెట్టుబడి దారులు, విదేశీ పెట్టుబడిదారులు, విదేశీ ఏజంట్ల నుండి దేశాన్ని, సోషలిస్టు నిర్మాణాన్ని కాపాడు కోవటానికి స్టాలిన్ అనేక చర్యలు తీసుకొన్నాడు.

పార్టీకి బయటవున్న కులక్‌లు, పెట్టుబడి దారులపై, రైతులు, కార్మికవర్గమూ దాడులు ప్రారంభించడానికి ముందే పార్టీ లోపల ట్రాట్స్కీ, జినోవివ్‌ల కూటమిపైన పార్టీ పోరాటం కేంద్రీకరించింది. బుఖారిన్, రైకోవ్‌ల ముఠా అటూ యిటూ కానట్లు దాగివుంది. కులక్‌లపైన, పెట్టుబడిదారులపైన కార్మిక, కర్షకులు పోరాటం ప్రారంభించిన వెంటనే ముసుగుతన్నేసి పార్టీకి వ్యతిరేకంగా బయటకు వచ్చింది. ఈ అవకాశవాద ముఠాలు కులక్‌లను సమర్థించాయి. సమిష్టి వ్యవసాయ ఉద్యమ పురోగతిపై గుడ్డి వ్యతిరేకతను ప్రదర్శించారు. ఇక వర్గ పోరాటం అక్కర్లేదన్నారు. కులక్‌లు (భూస్వాములు), పెట్టుబడిదారులు శాంతి యుతంగా మారతారని వారిపై దాడులు చేయవద్దని వాదించారు. బూజుపట్టిన బూర్జువా సిద్ధాంతాలను భుజాన వేసుకొని ముందుకు వచ్చారు. సోషలిస్టు అభివృద్ధి విజయపరంపరలతో సాగి దోపిడీ శక్తుల కాళ్ళ క్రింద మట్టి లేకుండా చేసినపుడే వర్గ పోరాటం తీవ్రత తగ్గవచ్చుననీ – అంతవరకు పదునైన వర్గ పోరాటం అవసరమని చాటిన లెనినిస్టు పద్ధతిని ఒక్కపెట్టున వ్యతిరేకించిందీ ముఠా. విప్లవ ప్రతీఘాతుకులకు వంత పాడింది. ఊతమిచ్చింది. పార్టీలోని ముఠాలన్నింటికీ వ్యతిరేకంగా కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన బోల్షివిక్ పార్టీ అత్యంత దృఢమైన, మొక్కవోని పోరాటాలను సాగించింది. సోషలిస్టు విప్లవాన్ని పురోగమింపచేసింది.

పై నాలుగు దశలలో 1924 లెనిన్ మరణం తర్వాత విప్లవ ప్రతీఘాతకులు, పార్టీలో ద్రోహులు విజృంభించారు. స్టాలిన్‌పైన జరిగిన దాడులూ, నేటికీ జరుగుతున్న దాడులు శ్రామికవర్గ నియంతృత్వ సూత్రాన్ని అర్థం చేసుకొనలేకపోవడం వలనగానీ; దాని పట్ల వ్యతిరేక దృక్పథం వుండటం వలన గానీ స్టాలిన్‌ని దుర్మార్గుడిగా చిత్రించడం జరుగుతూంది. నిజమే, స్టాలిన్ శ్రామిక వర్గ పక్షపాతే. వారి తరపున ఆయన శ్రామికవర్గ నియంతృత్వ రాజ్యానికి నాయకుడిగా నియంతృత్వాన్ని అమలు జరిపాడు. పీడకవర్గాల పట్ల కఠినంగా వ్యవహరించాడు. ఆయన రష్యాలోని కులక్‌ల పట్ల, పెట్టుబడిదారుల పట్ల విదేశీ ఏజంట్ల పట్ల కఠినంగా వ్యవహరించాడు. రష్యా సోషలిస్టు విప్లవాన్ని పురోగమింపచేశాడు. అంతేకాదు తూర్పు యూరప్ రాజ్యాలలో, ఆసియా దేశాలలో సాగిన విప్లవోద్యమ విజయానికి సహాయ సహకారాలు అందించాడు. హిట్లరు ఫాసిజాన్ని చావుదెబ్బ తీసి రెండవ ప్రపంచ యుద్ధంలో అనేక దేశాలలో శ్రామికవర్గ రాజ్యాల నిర్మాణానికి దోహద పడ్డాడు.

రష్యా కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) నాయకుడిగా సోషలిస్టు విప్లవ రథసాధిగా స్టాలిన్ చేసిన కృషి మూలంగా మార్క్సిజం – లెనినిజం సాధించిన విజయాల మూలంగా మార్క్సిజం వన్నెకెక్కడమే కాదు అభివృద్ధి చెందింది.

**ఐదు :** స్టాలిన్ మరణం తర్వాత పొంచివున్న పెట్టుబడిదారీ వర్గీయులు, ట్రాట్స్కీ, జినోవివ్, బుఖారిన్ అనుచరులయిన కృశ్చేవ్ తదితరులు స్టాలిన్‌పైన దాడి చేయడం ద్వారా మార్క్సిజంపైన దాడికి పూనుకొన్నారు. శ్రామికవర్గ రాజ్యం ఏర్పడిన 40 సంవత్సరాల తర్వాత సోషలిజం విజయం సాధించిందనుకున్న తర్వాత గూడా పెట్టుబడిదారీ వర్గీయులు దాగివుండి కమ్యూనిస్టు ఆశయాలపైన దాడులకు పూనుకున్నారు. అంటే వర్గ పోరాటం అంతం కాలేదనేది స్పష్టం. పార్టీకి వెలుపల సమాజంలో వివిధ భావాల, సిద్ధాంతాల, రాజకీయాల మధ్య జరిగే సంఘర్షణ ప్రతిబింబంగానే పార్టీ లోపల, కమ్యూనిస్టు ఉద్యమం లోపల జరిగే

పోరాటాలుంటాయని మార్క్సిజం – లెనినిజం బోధిస్తున్నది. రష్యాలో లెనిన్, స్టాలిన్‌లు నాయకత్వ మోహించినంతకాలం పార్టీ లోపల అన్యవర్గ సిద్ధాంతాలపైన తీవ్రమైన పోరాటాలు సాగాయి. సోవియట్ కమ్యూనిస్టు పార్టీలో ఆ పోరాటాన్ని సాగించే శక్తులు బలహీనపడటం, ఆచరించడంలో తడబడటంలాంటి బలహీనతలు కృశ్చేవ్ లాంటి గుంటనక్కలు పైచేయి సాధించటానికి అవకాశ మిచ్చాయి.

స్టాలిన్ గూడ తప్పులకు, పొరపాట్లకు అతీతుడు కాదు. ఆ మాటకొస్తే మార్క్స్, ఏంగెల్స్, లెనిన్‌లు గూడా అతీతులు కాదు. అయితే తప్పులను వారంతటవారే గ్రహించి సరిదిద్దుకోవడం, పార్టీ కమిటీలు, పార్టీ శ్రేణులు, ప్రజాకార్యచరణ, చర్చల ద్వారా గ్రహించి సరి చేసుకోవటమన్న పద్ధతినే వారనుసరించారు. అయితే తప్పులకు మాత్రమే స్టాలిన్‌ని బాధ్యుణ్ణి చేసి, ఆయన నాయకత్వాన సాధించిన విజయాలన్నిటిపైన దాడిచేసి నీరు గార్చడం అత్యంత దుర్మార్గమైనది. మార్క్సిజం – లెనినిజాలను తిరగదోడిన పెట్టుబడిదారీ మార్గీయులు కృశ్చేవ్, అతని గురువులు, నేటి శిష్యులు మాత్రమే యిలాంటి దుర్మార్గానికి ఒడిగట్టారు. ప్రపంచ శ్రామిక వర్గ విప్లవానికే ద్రోహం చేశారు.

రష్యాలో పెట్టుబడిదారీ మార్గీయులైన కృశ్చేవ్, బ్రెజ్నేవ్‌ల వారసుడు గోర్బచెవ్ కాలంలో రష్యా వ్యవస్థ అన్ని రకాలుగా సంక్షోభంలో కూరుకు పోయింది. వ్యక్తిగత ఆస్తి సిద్ధాంత పరిరక్షణ చేసి, దోపిడీ పెట్టుబడిదారీ వర్గ నిరంకుశత్వాన్ని అమలు జరుపుతున్నారు. ఈ నిరంకుశత్వం అతికొద్ది దోపిడీదారుల ప్రయోజనాలను కాపాడుతున్నది. శ్రమజీవుల, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలను బలి తీసుకుంటున్నది. ఈ నిరంకుశత్వం దోపిడీ దారుల పక్షపాతానికి సంబంధించినది. బూర్జువా వర్గ నియంతృత్వం.

కనుక స్టాలిన్‌ని నిరంకుశుడని, కర్కోటకుడనీ నిందించేవారు – శ్రామికవర్గ నియంతృత్వాన్ని వ్యతిరేకించేవాళ్ళవుతారు. మార్క్సిజం–లెనినిజా లలో అత్యంత ప్రాముఖ్యత గల ఈ సూత్రాన్ని వదలివేసిన తరువాత పీడితవర్గ విముక్తి గురించి ఆలోచించనవసరం లేదు. మార్క్సిజం–లెనినిజాలపైన దాడి చేయటం ద్వారా సోషలిజంపైన, శ్రామికవర్గ నియంతృత్వంపైనా దాడి చేస్తున్నారు. బూర్జువావర్గ నియంతృత్వాన్ని శ్రామికవర్గ నియంతృత్వాన్ని ఒకే గాటకడుతున్నారు. సోషలిజాన్ని నిర్మించడానికి శ్రామికవర్గ నియంతృత్వం యొక్క ఆవశ్యకతను కాదనేవారు బూర్జువా పెట్టుబడిదారీ మార్గీయులపై పోరాడలేరు. వీరిపైన పోరాటం చాలా కఠినమైనది. నిరంతరాయమైనది. కనుక పెట్టుబడిదారీ వర్గాన్ని కూలద్రోయడంతోనే సరిపోదని లెనిన్ వివరించాడు.

ఇది ఒక ప్రారంభం మాత్రమే. అయితే అసాధారణమైన గొప్ప ప్రాధాన్యత కలిగిన ప్రారంభం. బూర్జువావర్గాన్ని కూలద్రోయడం కంటే మరింత కష్టమైన, మరింత లోతైన, మరింత సమూలమైన, మరింత నిర్ణయాత్మకమైన విప్లవానికిది ప్రారంభం. ఎందుకంటే అది మనలోని జడత్వంపైన, క్రమ శిక్షణారాహిత్యంపైన, పెటీ బూర్జువా వ్యామోహం పైన విజయం; ఓడిపోయిన పెట్టుబడిదారీ విధానం తన వారసత్వంగా కార్మిక రైతాంగ ప్రజలలో వదలి వెళ్ళిన అలవాట్లపైన విజయం. ఈ విజయాన్ని సంఘటితపరచుకొన్నప్పుడు మాత్రమే నూతన క్రమశిక్షణ, సోషలిస్టు క్రమశిక్షణ సృష్టించబడుతుంది. అప్పుడు మాత్రమే పెట్టుబడిదారీ విధానంలోకి తిరోగమనం అసాధ్యమవుతుంది. కమ్యూనిజం అజేయంగా రూపొందుతుంది".(ది గ్రేట్ బిగినింగ్)

వర్గపోరాటం నిరంతరాయమైనది. అది కమ్యూనిజం సాధించబడేవరకూ సాగుతూనే ఉంటుంది. అది వర్గ శత్రువులు నాశనం కానంత కాలం – అంటే సామ్రాజ్యవాదులు, నిరంకుశాధికార వర్గమూ వున్నంత కాలం కొనసాగాల్సిందే. అదే విధంగా సోషలిస్టు అభివృద్ధి పురోగమన క్రమంలో దాని వర్గ పోరాట తీవ్రత కొన్ని సందర్భాలలో తగ్గవచ్చు. కానీ వర్గ పోరాటం మాత్రం అంతం కాదు.

## 2

అర్ధవలస, అర్ధఫ్యూడల్ వ్యవస్థను గజగజ లాడించిన చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం, రూపంలో రష్యా విప్లవానికి భిన్నమైనదే. కానీ రెండు విప్లవాల సారమూ, లక్ష్యమూ ఒక్కటే. మనిషిని మనిషి దోచుకునే సమాజాల స్థానంలో సమానత్వాన్ని సాధించడం; దోపిడీ వర్గాలను, వారి రాజ్యాంగ యంత్రాన్ని కూలదోసి శ్రామికవర్గ రాజ్యాన్ని సాధించడం. అంతిమంగా వర్గరహిత కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించడం.

వేలాది సంవత్సరాలుగా వేళ్ళూనుకొనిపోయిన చైనా భూస్వామ్య వ్యవస్థపైన చైనా పీడిత తాడిత ప్రజానీకం చేసిన తిరుగుబాట్లతో మొదలయింది యీ విప్లవం. అంతిమంగా భూస్వాముల అధికారాన్ని, సామ్రాజ్యవాద పెత్తనాన్ని కూలదోసిన విప్లవమది. అర్ధఫ్యూడల్, అర్ధవలస వ్యవస్థలుగా వున్న దేశాల లోని పీడిత ప్రజలకు మార్గం చూపిన విప్లవమది. రైతాంగం ప్రధాన శక్తిగా కార్మికవర్గ నాయకత్వాన విప్లవ వర్గాలన్నిటితో కూడిన (రైతాంగం, కార్మికులు, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా) ఐక్య సంఘటనా శక్తితో, ప్రజాసాయుధశక్తితో సాగిన దీర్ఘకాల ప్రజాయుద్ధమది. కార్మికవర్గం తన అగ్రగామియైన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వ రాజ్యాన్ని ఆవిర్భవింపచేసిన విప్లవమది.

ఈ ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వ రాజ్య స్థాపనలతో చైనా ప్రజలు అర్ధవలస, అర్ధభూస్వామ్య స్థితి నుంచి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొంది విముక్తు లయ్యారు. ఈ విముక్తి పోరాటం ప్రపంచ పీడిత ప్రజలందరినీ ఉత్తేజపరచింది. మానవ సమాజ పురోగమన క్రమంలో రష్యావిప్లవం ఒక గుణాత్మక పరిణామం కాగా, చైనా విప్లవం కుళ్ళి కునారిల్లి పోతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలకు గోరీకట్టే సంకేతంగా నిలిచింది. మానవ సమాజం మరింత పురోగమనంవైపే సాగుతుందన్న గతితార్కిక భౌతికవాద

సూత్రాలను రుజువుపరచింది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలన్నింటా విప్లవాగ్ను లను రగిల్చింది. తూర్పు యూరప్‌లో కార్మికవర్గం సాగించిన ప్రజాస్వామిక విప్లవాలతో భుజం, భుజం కలిపింది. స్వేచ్ఛా, స్వాతంత్ర్య, శాంతికాముక శక్తుల బలాన్ని పెంచింది. మరింత దృఢమైన, సంఘటితమైన పోరాటాలు సాగడానికీ, సాగుతున్నవి నిలదొక్కుకోడానికీ, పురోగమించడానికీ దోహదపడింది.

ఈ విప్లవ విజయం సాధారణమైంది కాదు. దీన్ని సాధించడానికి మావో నాయకత్వాన చైనా కమ్యూనిస్టు పార్టీ సలిపిన పోరాటాలూ సామాన్యమైనవి కావు. శత్రువులు–భూస్వాములు, సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధక దళారీ బూర్జువాలకు వ్యతిరేకంగా అశేష పీడిత ప్రజానీకాన్ని నడిపించింది. ఎన్నో ఆటంకాలనధిగమించింది. పార్టీ లోపల వివిధ రకాల పెడధోరణుల నెదుర్కొంటూ పురోగమించింది.

చైనా ప్రజారిపబ్లిక్ ఏర్పాటు ముందు వరకూ సాగిన చైనా విప్లవ నాలుగు దశలలో పార్టీలో అతివాద, మితవాద ధోరణులు వెంబడించాయి. ఈ రెండు ధోరణులూ కవలపిల్లల్లాగా, బొమ్మా, బొరుసుల్లాగా చైనా కమ్యూనిస్టు పార్టీ కుడి, ఎడమ భుజాల మీదికెక్కి కూర్చున్నాయి. ఒకసారి అతివాదం ప్రధాన ప్రమాదంగా నెత్తికెక్కితే ఇంకొకసారి మితవాదం ప్రధాన ప్రమాదంగా తలెత్తి లొంగుబాటు ధోరణిగా రూపుదాల్చింది. ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వ ప్రభుత్వమేర్పడే దశలో అతివాదం ప్రధానంగా ముందుకొచ్చింది. ప్రజారిపబ్లిక్ ఏర్పడి సోషలిస్టు ఉద్యమం ప్రారంభమయ్యేసరికి, మితవాద అవకాశ వాదం ముందుకొచ్చింది. కామ్రేడ్ మావో నాయకత్వాన చైనా కమ్యూనిస్టు పార్టీ మార్క్సిజం –లెనినిజాలకు కట్టుబడి వీటి నెదుర్కొంది. చైనా నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి ప్రతిదశలోనూ పార్టీ లోపలా, వెలుపలా తలెత్తిన అతివాద, మితవాద, లొంగుబాటు ధోరణులను ఓడించింది.

చైనా తన కాళ్లపై సగర్వంగా నిలబడే చర్యలు తీసుకుంది. "ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వం" ద్వారా శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పాలనే దృక్పథం తీసుకొంది. జపాన్ వ్యతిరేక పోరాటం, అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలను ఓడించిన దేశంగా, అర్థఫ్యూడల్, అర్థవలస వ్యవస్థనుండి నూతన ప్రజాతంత్ర వ్యవస్థగా మార్పు చెందే క్రమాన్ని తొలిమెట్టుగా ప్రజల "ప్రజాతంత్ర నియంతృత్వ" విధానాన్ని అమలు జరిపింది. (చదవండి "నూతన చైనా నూతన ప్రపంచం") తిండి, బట్టలలో స్వయం సమృద్ధినీ, చదువు సంధ్యలలో పురోగమనశీల ప్రజాతంత్ర సంస్కృతినీ సాధించడానికి కృషి చేసింది. 1950 దశాబ్దం నాటికి వెనుకబడిన వర్ధమాన దేశాలన్నిటికి తలమానికంగా నిలబడింది. 'ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వ సిద్ధాంతం' ద్వారా దేశీయ ఐక్య సంఘటన ఏర్పాటు చేసింది. కార్మికవర్గ నాయకత్వం క్రింద రైతాంగం, పట్టణ ప్రాంత పెట్టీ బూర్జువాలు, జాతీయ బూర్జువాలు – చిన్న పెట్టుబడిదారులలో కూడిన ఐక్య సంఘటన ద్వారా ప్రజల రాజ్యాంగ యంత్రాన్ని ఏర్పరచింది – అంటే ప్రజానుకూల సైన్యం, ప్రజానుకూల పోలీసులు, ప్రజానుకూల కోర్టులను ఏర్పరచి ప్రజల నియంతృత్వాన్ని దోపిడీ వర్గాలపై చెలాయించి ప్రజల ప్రయోజనాలను కాపాడే ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వాన్ని అమలు జరిపింది.

చైనా వ్యవసాయ ఉత్పత్తులలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ప్రజాజీవన ప్రమాణం పెరిగింది. ఆర్థిక విజయాలు కొన్ని ప్రమాదాలను తెచ్చిపెట్టాయి. దురహంకారం పెరిగింది. దేశభక్తికి స్థానం ఎక్కువ యివ్వడం, చాలా సాధించాం యింకేం కావాలి అనుకునే ధోరణులు పెరిగాయి. 1956లో నాటి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెసు కృశ్చేవ్ రివిజనిజాన్ని స్వీకరించింది. దాని ప్రభావం అంతర్జాతీయంగా ఎంత హానికరంగా, ప్రమాదకరంగా వుంటుందో చైనా కమ్యూనిస్టు పార్టీ గ్రహించింది. ముఖ్యంగా సోషలిస్టు దేశాలలో అది కలిగించే ఉపద్రవం చాలా తీవ్రంగా ఉంటుంది. చైనా పార్టీ ఆనాటి నుంచే రివిజనిజానికి వ్యతిరేకంగా సిద్ధాంత పోరాటం సాగించింది. కానీ 1960ల నుంచే బహిరంగంగా విమర్శించడం మొదలయింది. చైనాలో రివిజనిస్టులు పెట్టుబడిదారీ మార్గీయులుగా బయటపడ్డారు. 1965 నుంచి వీరికి వ్యతిరేకంగా పోరాటం తీవ్రమైంది. బిగ్‌పోస్టర్ ఉద్యమంలో పెట్టుబడిదారీ మార్గీయులపై పోరాటం ప్రారంభ మైంది. రెడ్‌గార్డ్స్ ఉద్యమం మొదలయింది.

ప్రజా రిపబ్లిక్ ఏర్పాటుతో సోషలిస్టు విప్లవ దశలోకి ప్రవేశించిన చైనాలో శ్రామికవర్గానికి – బూర్జువావర్గానికి మధ్యవున్న వైరుధ్యం ప్రధాన మైంది. కానీ లీ–షావ్–చీ నూతన ప్రజాతంత్ర వ్యవస్థను సంఘటిత పర్చాలనీ, సొంత ఆస్తి రక్షణకు హామీ యివ్వాలనే వైఖరి ద్వారా నూతన ప్రజాతంత్రం నుండి సోషలిజంలోకి రాదలచుకోలేదని స్పష్ట మయ్యింది.

ఎనిమిదవ పార్టీ కేంద్రకమిటీ ఎనిమిదవ సమావేశంలో పెంగ్‌తెహువాయ్ మహత్తరమైన ముందడుగు (గ్రేట్ లీప్ ఫార్వర్డ్)నూ, ప్రజా కమ్యూన్‌లను, విప్లవ ప్రజా ఉద్యమాన్ని వ్యతిరేకించాడు. ఇతని మితవాద అవకాశవాదంపై మావో తీవ్రమైన పోరాటం చేశాడు.

9వ పార్టీ కాంగ్రెసుకు లిన్‌పియావో, కాలిన్ సియాల్ పెట్టిన రిపోర్టుని కేంద్రకమిటీ త్రోసి పుచ్చింది. దానితో ఆయన పెట్టుబడిదారీ వర్గానికి, కార్మికవర్గానికి ప్రధాన వైరుధ్యం అన్నదానికి బదులు వెనుకబడిన ఉత్పత్తిశక్తులకూ–అభివృద్ధి చెందిన సోవియట్ పద్ధతికి వైరుధ్యం ప్రధానమని నిర్వచించాడు. ఇది వర్గ సామరస్య సిద్ధాంతం. వర్గ పోరాటం అంతమైందనిగానీ లేక అక్కర్లేదని గానీ ఈ పంథా బోధించింది. సోషలిస్టు వ్యవస్థలో గూడా వర్గ పోరాటం వుంటుందనే మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని తిరస్కరించింది. లీషావ్–చీ, పెంగ్‌తె– హువాయ్, లిన్‌పియావోలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం పార్టీలో 50 ఏండ్లుగా జరుగుతూ వచ్చిన రెండు పంథాల మధ్య పోరాటంలో భాగమేనని మావో అన్నాడు. యిదే చివరిది కాదు. పెట్టుబడిదారీ మార్గీయులున్నంత వరకూ ఇది

సాగుతూనే వుంటుందన్నాడు. ఆంతరంగిక పోరాటాల అనుభవం నుంచి మావో మూడు సూత్రాలను పేర్కొన్నాడు.

1. మార్క్సిజం కోసం పోరాడండి – రివిజనిజాన్ని వ్యతిరేకించండి.
2. ఐక్యత కోసం నిలబడండి – విచ్ఛిన్నాన్ని, చీలికలను వ్యతిరేకించండి
3. మనస్సు విప్పి ప్రవర్తించండి – కుట్రలు కుహకాలు వ్యతిరేకించండి.

రెండు పంథాల మధ్య పార్టీలో అంతర్గత పోరాటం జరుగుతున్నప్పుడు ఒక తప్పుడు పంథా మరొక తప్పుడు పంథాని కాపాడుతుందని మావో హెచ్చరించాడు. బూర్జువాజీతో పోరాటంలో వారితో ఐక్యతే సాధ్యం కాదు; అది సంభవం కాదనే ధోరణి వున్నట్లే. బూర్జువాజీతో ఐక్య సంఘటన యేర్పడి నప్పుడు బూర్జువాజీతో పోరాటాన్ని మరచిపోవడం జరుగుతుందని మావో అన్నాడు. చైనా కమ్యూనిస్టు పార్టీలో బూర్జువాజీతో పోరాటం కాదు ఐక్యతే అన్న చెన్–టూ–షీ మితవాద పంథా; మొత్తం పోరాటమే గాని ఐక్యతలేదు అన్న వాంగ్‌మింగ్ అతివాద పంథాను కప్పిపుచ్చింది. అలాగే లీషావ్‌చీ మితవాద పంథాను లిన్‌పియావో అతివాద పంథా కప్పి పుచ్చింది. రెండూ అవకాశవాదాలే, అతివాదం మితవాదం రెండూ కవలపిల్లలేనని చైనా పార్టీ అనుభవం మరొకసారి రుజువుపరిచింది.

1976లో మావో మరణం తర్వాత క్రమంగా చైనాలో పెట్టుబడిదారీ మార్గీయులు పైచేయి సాధించారు. చైనాని పెట్టుబడిదారీ దేశంగా, చైనా కమ్యూనిస్టు పార్టీని రివిజనిస్టు పార్టీగా మార్చి వేశారు. చైనా ప్రజలు కార్మికవర్గ నాయకత్వాన ఈ రివిజనిస్టు కుక్కలను పెట్టుబడిదారీ మార్గీయులను ఎదిరించి తీరతారు. మావోని నియంత అని అన్నా, పిడివాదని అన్నా; పల్లెటూరి రైతు అన్నా, నేటికీ విలువలేదనే సత్యాన్ని చైనా విప్లవోద్యమ పాఠాలు తెలుపుతున్నాయి. మావో ప్రజల మనిషి; మావో గొప్ప మార్క్సిస్టు – లెనినిస్టు; మావో కార్యశీలి, మావో వీరయోధుడు, మహోపాధ్యాయుడు, మహానాయకుడు. పాత క్యాలెండర్ ప్రకారంగా అక్టోబరు రష్యా విప్లవం కొత్త క్యాలెండర్ ప్రకారం నవంబరు రష్యా విప్లవంగా పిలువబడుతున్నది. కనుక నవంబర్ రష్యా విప్లవం, అక్టోబర్ చైనా విప్లవం (దీనికి పాత క్యాలెండర్ లేదు), మానవజాతి చరిత్రలో రెండూ రెండు మైలురాళ్ళు.

ఈ రెండు దేశాల కమ్యూనిస్టు పార్టీలు పుట్టినప్పటి నుడి అనేక పెడధోరణులకు చెందిన ప్రతినిధులు మార్క్సిజం–లెనినిజాలకు వ్యతిరేకంగా ఆటంకాలు కల్పిస్తూనే వున్నారన్న నగ్నసత్యం అందరకూ తెలిసిందే. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన శ్రామిక ప్రభుత్వాలేర్పడిన తర్వాత గూడ ఆ శక్తులు మార్క్సిజాన్ని తొలిచే కార్యక్రమం వదులుకోలేదు. వాళ్లు మార్క్సిజం ముసుగులోనే దాగివున్న పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ఏజంట్లు. కనుకనే రెండు కమ్యూనిస్టు పార్టీలలో ఎన్ని పేర్లు పెట్టుకున్నా మౌలికంగా రెండు విధానాల మధ్య పోరాటాలుగానే సాగాయి. అయితే రష్యాలో స్టాలిన్ మరణానంతరం, చైనాలో మావో మరణానంతరం అవి తిరిగి విజృంభించడం, అధికృతను సంపాదించడం ఎలా జరిగింది? అంత దీర్ఘకాల పోరాటాలలో రాటుదేలిన కార్యకర్తలు, ప్రజలు వీరి అధికృతను ఎందుకు ఆమోదించారు? ఎందుకు కొనసాగిస్తున్నారు? యింకా యిలాంటి ప్రశ్నలే వున్నాయి. ఎన్ని ప్రశ్నలున్నా యీ పెట్టుబడిదారీ విద్రోహశక్తులు ఈ మహావిప్లవాలనే మైలురాళ్ళను పెళ్ళగించలేవు. ఇంకా మిగిలి వున్న; దాగి వున్న విప్లవ శక్తులు పుంజుకొని తిరిగి విజృంభించే రోజొస్తుంది.

మానవ సమాజ చరిత్ర, దాని పరిణామ చరిత్ర వయస్సు 10 లక్షల సంవత్సరాలు. రష్యా కమ్యూనిస్టు విప్లవోద్యమ వయస్సు 100 సంవత్సరాలయితే, చైనా విప్లవోద్యమ వయస్సు 70 సంవత్సరాలే. మానవజాతి నడచిన కోట్లాది యోజనాలలో రష్యా, చైనా ప్రజలు నడచింది అతికొద్ది యోజనాలే. పది లక్షల సంవత్సరాల వయస్సు గల మానవ సమాజ చరిత్రలో రష్యా, చైనా కమ్యూనిస్టు ఉద్యమాల వయస్సు నూరు సంవత్సరాలే. కనుక అప్పుడే ఏమీ అయిపోలేదు. రివిజనిస్టులు, పెట్టుబడిదారీ మార్గీయులు నిజమైన విప్లవకారులను, కమ్యూనిస్టు యోధులను తాత్కాలికంగా ఓడించవచ్చు, ప్రక్క నుంచవచ్చుగాక, వారెన్నటికీ పైచేయి కాలేరు. లెనిన్ రివిజనిస్టులను గురించి కమ్యూనిస్టు వ్యతిరేక అభివృద్ధి నిరోధకుల గురించి మాట్లాడుతూ రష్యా సామెతను చెప్పాడు:

"కొన్ని సమయాల్లో గద్దలు తక్కువ ఎత్తులో ఎగురుతూండటం కద్దు. కానీ కోడిపెట్టలు వాటి జన్మలో గద్దలు ఎగిరేంతటి ఎత్తు ఎగరజాలవు". కనుక రివిజనిస్టుల ఆధిక్యం ఎల్లకాలం సాగదు.

ఈరోజు స్టాలిన్ తరం, మావో తరం అనుభవజ్ఞులయిన నాయకులు లేకపోవచ్చుగాక, ఎల్లకాలం పరిస్థితి యిలాగే వుండదు. ప్రపంచ చరిత్ర మొత్తం వర్గ పోరాటాల చరిత్రే. వర్గ పోరాటాలు ఇంకా అంతం కాలేదు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, భూస్వామ్య, అర్ధభూస్వామ్య వర్గ పీడన సాగినంత కాలమూ వర్గ పోరాటమూ ఉంటుంది. ప్రతిఘటనా పోరాటాలు, ప్రతిఘటనా యుద్ధాలు, సాయుధ పోరాటాలూ వుంటాయి. అవి హెచ్చుతగ్గులుగా సాగుతూండవచ్చు. విప్లవోద్యమ కార్యకర్తలు, నాయకులూ ఈ వర్గ పోరాటాల నుండీ ప్రజావిప్లవోద్యమాల నుండే పుట్టుకొస్తారు. స్టాలిన్, మావోలు అలా వర్గ పోరాటాల నుండీ, ప్రజా విప్లవోద్యమాల నుండీ పుట్టుకొచ్చినవారే. అత్యంత కఠినమైన పోరాటాలలోనే వారు రాటుదేలారు.

నేడు సామ్రాజ్యవాదులు, బూర్జువావర్గమూ, భూస్వామ్య వర్గమూ కమ్యూనిస్టులకున్న ఈ అవకాశాన్ని మాత్రం తప్పించలేరు. మావో వంటి నాయకుడు నేడు లేకపోయినా, గొప్ప నాయకులు నేటికీ కొనసాగుతున్న వర్గ పోరాటంలో నుంచే పుట్టుకొస్తారు. రాటుదేలుతారు. ఈ దోపిడీ వ్యవస్థకు గోరీ కట్టే మహత్కార్యానికి నాయకత్వమొహిస్తారు.

రష్యా, చైనా విప్లవాలు మార్క్సిజాన్ని ఆశ్రయించి, అన్వయించి ఆచరించిన దాని ఫలితమే. అయితే మార్క్సిజం కూడా తన అభివృద్ధి క్రమంలో అనేక ఇతర సిద్ధాంతాలను ఎదుర్కోవలసి వచ్చింది.

లెనిన్ ఇలా అన్నాడు:

"మార్క్సిజం తక్షణమే తన స్థానాన్ని స్థిర పరుచుకోలేదు. మొదటి అర్థ భాగంలో (1840) మార్క్సిజం-తనతో భేదించే సిద్ధాంతాలతో పోరాడింది. 1840లలో తాత్విక ఆదర్శవాదాన్ని పట్టుకున్న హెగెల్ అనుచర వర్గాన్ని ఓడించింది. ఆ తరువాత ఆర్థిక విషయాలలో 1880 కల్లా ప్రొధాన్ సిద్ధాంతా లను ఓడించింది. 1860లలో మార్క్సిజం సిద్ధాంత స్థాయి నుండి ఆచరణ స్థాయికి చేరి కార్మిక వర్గం లోకి ప్రవేశించింది. ఆచరణలో హానికరమైన సిద్ధాంతాలను ఓడించి, తన ఆధిక్యతను రుజువు పరుచుకుంది. 1890 నాటికి మార్క్సిజం సంపూర్ణ విజయాన్ని సాధించింది. రెండవ ఇంటర్నేషనల్ మార్క్సిజాన్ని అంగీకరించింది."

(ప్రపంచ కార్మికోద్యమం-కమ్యూనిస్టు ఉద్యమం)

## 3
## భారత కమ్యూనిస్టు విప్లవోద్యమం

అక్టోబరు విప్లవ ప్రభావముతో మార్క్సిజం దేశదేశాల వ్యాపించింది. భారతదేశంపై కూడా అదే ప్రభావాన్ని కలిగించింది. భారత కమ్యూనిస్టు ఉద్యమం కూడా అనేక రాజకీయ సిద్ధాంత, నిర్మాణ, ఉద్యమ సంబంధిత విషయాలను, ఒడిదుడుకులను, ఆటుపోటులను ఎదుర్కొంది. విజయాలను, అపజయాలను, పొరపాట్లను, విద్రోహాలను చవి చూసింది.దానికిప్పుడు 90 సంవత్సరాలు.

సోషలిజం సాధన లక్ష్యంగా, వలస పాలనను తుదముట్టించి దేశానికి స్వాతంత్ర్యం సాధించాలనే లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీ కృషి సాగించింది. వలసాధిపత్యవాదులయిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మార్క్సిజం-లెనినిజం భారత గడ్డపై విస్తరించ కూడదనే లక్ష్యంతో మొగ్గలోనే పార్టీ కార్యకలాపాలను తుంచివేయాలనే కుట్ర పన్నారు. కమ్యూనిస్టుల పైన, విప్లవకర దేశభక్తులపైన పెషావర్, లాహోర్, కాన్పూర్, మీరట్ పట్టణాలలో కుట్ర కేసులు పెట్టారు. కాన్పూర్, మీరట్ కుట్ర కేసులలో కమ్యూనిస్టు పార్టీ స్థాపకులను, నేరస్థులుగా బంధించారు. కార్మిక, రైతాంగ ఉద్యమాలను అణచ పూనుకొన్నారు.

దేశవ్యాప్తంగా ముఖ్యంగా కలకత్తా, కాన్పూర్, బొంబాయి నగరాల్లో కార్మికవర్గ సమ్మెలు వెల్లువగా సాగాయి.

1935-45 మధ్య కాలంలో రైతాంగ పోరాట వెల్లువలు - బీహార్, బెంగాల్, యు.పి. తెలంగాణ, గుజరాత్, కేరళ, పంజాబ్ మరియు మద్రాస్‌లలో పెల్లుబికాయి. మహారాష్ట్రలోని థానే జిల్లా, వర్లీలో ఆదివాసీ పోరాటాలు, 1943 కేరళ రాష్ట్రంలోని కర్యూరు, తిరువాన్కూర్ జిల్లాలో పున్నప్రా-వాయలార్ తిరుగుబాట్లు, 1946లో బెంగాల్ తెభాగా పోరాటం యొక్క సాయుధ తిరుగుబాటు ఆనాటి తూర్పు బెంగాల్ నేటి బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ జిల్లాలో రైతాంగ సాయుధ ప్రతిఘటన, మహారాష్ట్ర లోని అహ్మద్‌నగర్‌లో రైతాంగ పోరాట వెల్లువలు సాగాయి. 1946-56 హైద్రాబాద్ సంస్థానం నిజాం నవాబుకి, ఫ్యూడల్ దొరలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగిన సాయుధ ప్రతిఘటనా - తిరుగుబాటు గెరిల్లా యుద్ధ స్థాయికి చేరింది. ఫ్యూడల్ దొరలు, దుండగులు రైతాంగ పోరాట శక్తికి తాళలేక ఆ ప్రాంతం విడిచిపోయారు.

### తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం

1948లో పార్టీ నాయకత్వం ఒక సిద్ధాంత ప్రతిపాదన చేసింది. అదే ఆంధ్రథీసిస్.

"భారత సామాజిక వ్యవస్థ యొక్క స్వభావాన్నీ, లక్షణాలను నిర్వచించింది. ఈ వ్యవస్థ దళారీ బూర్జువా, భూస్వామ్య వ్యవస్థ అనీ, కార్మికవర్గ నాయకత్వాన కార్మిక కర్షక మైత్రిని నెలకొల్పుతూ జాతీయ బూర్జువా వర్గాన్ని కలుపుకురావడం విప్లవ వ్యూహంగా నిర్వచించింది. అలాగే గ్రామస్థాయిలో కూలీలు, పేద రైతాంగం, మధ్యతరగతి, ధనిక రైతాంగంతో కూడిన సంఘటన నేర్పాటు చేయడం, ప్రజా విప్లవ పంథాలో వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించడం గ్రామాలను విముక్తి చేస్తూనే క్రమంగా విముక్తి స్థావర ప్రాంతాలను నిర్మించుకొంటూ సాగే విప్లవమనే నిర్వచించింది". ఆ విధానాల ఆధారంగా కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది.

తెలంగాణా సాయుధ పోరాటం దేశ స్వాతంత్ర్యం కోసం - నిజాం పాలన రద్దు కోసం- భూస్వామ్య దొరల బానిసత్వం నుంచి విముక్తి కోసం జరిగిన రైతాంగ సాయుధ తిరుగుబాటు - దానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. 3 వేల గ్రామాలలో 10 వేల ఎకరాల భూమి పీడిత రైతాంగం స్వాధీనం చేసుకొన్నారు. 4000 మంది కామ్రేడ్స్, రైతాంగ పోరాట యోధులు తెగువతో పోరాడి అమరులయ్యారు.

నేటి పాలకులకు ఫ్యూడల్ దొరతనాన్ని కాపాడే లక్షణమే ఉంది. అందుచేతనే వారు కమ్యూనిస్టులు సాగించిన ఉద్యమంతో చేతులు కలపలేదు. బూర్జువా, సామ్రాజ్యవాద దోపిడీ నుంచి తెలంగాణ ప్రజలు సంపూర్ణ విముక్తి పొందలేక పోవడానికి ఈ ఫ్యూడల్ బూర్జువావర్గాల రాజకీయాలు, కమ్యూనిస్టు పార్టీలోని మితవాద సంస్కరణవాదం కారణ మయ్యాయి. పార్టీలో జరిగిన సిద్ధాంత పోరాటానికి విస్పష్టమైన మార్క్సిస్టు - లెనినిస్టు దృక్పథం ప్రాతిపదిక మీద సమీక్ష లేకుండా పోయింది. దీని మూలంగా ప్రజా వ్యతిరేకులైన ఫ్యూడల్, బడా బూర్జువా, సామ్రాజ్యవాద అనుకూల పాలకవర్గాలు తెలంగాణా ప్రజల విముక్తి పోరాటాన్ని తమదిగా చాటుకుంటున్నారు. కమ్యూనిస్టు పార్టీకి సరైన గుణపాఠాలు అందకుండా పోయాయి.

**తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం గురించి కామ్రేడ్ దేవులపల్లి విశ్లేషించిన విషయాలు:**

"తెలంగాణ సాయుధ పోరాటం గ్రామీణ ప్రజా జీవితంలో, విప్లవాత్మక మార్పు తెచ్చిందని స్పష్టమవుతుంది. దీనితో గ్రామాల్లో కొత్త జీవితం ఏర్పడింది. అదే జనతా ప్రజాతంత్ర జీవితం. ఈ విప్లవం ద్వారానే ఇలాంటి మార్పు వస్తుంది. భూస్వాముల భూమిని పంపకం చేయటం, గ్రామీణ జీవితంలో పేదరికాన్ని నిర్మూలించటం, నిరుద్యోగాన్ని నిర్మూలించటం లాంటి మార్పులను వందలు, వేలు, లక్షల, కోట్ల రూపాయలు ఖర్చు చేసినా, 36 సంవత్సరాలు గడిచిన నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వాలు గానీ, ఇతర పార్టీలకు చెందిన ప్రభుత్వాలు కానీ సాధించలేదు. ఈ మార్పులను ఆనాడు ఒక సంవత్సర కాలంలో ఈ విప్లవోద్యమం ద్వారా సాధించారు. దీని ద్వారా కొత్త ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. గ్రామ రాజ్యాలు ఏర్పడటం ద్వారా కొత్త రాజకీయ వ్యవస్థ ఏర్పడింది. కిరాయి మనుషులకు బదులుగా తమ భూమిని ఇళ్ళను కాపాడుకోవటానికి ప్రజల బిడ్డలతో ఏర్పడిన గెరిల్లా దళాలతో కొత్త మిలటరీ నిర్మాణం ఏర్పడింది. అంతేకాకుండా స్థానిక దళాలు తమ వ్యవహారాలను తామే చక్కబెట్టుకుంటూ, తామే శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, కొత్త శాంతి భద్రతల వ్యవస్థ ఏర్పడింది. నూతన ఆర్థిక, రాజకీయ జీవితంతో పాటు కొత్త సాంస్కృతిక జీవితం కూడా ఏర్పడింది. దొంగతనాలు లేకపోవటం, అందరూ చదువుకోవటం, వ్యభిచారం లేకపోవటం, విడాకుల హక్కు స్త్రీలనుభవించటం, స్త్రీలు అన్ని రంగాల్లో తమ చైతన్యానికి, నిర్మాణానికి అనుగుణ్యంగా పాల్గొనటం, పాల్గొనేందుకు ముందుకు రావటం, ఇంతేకాకుండా కష్టించి పనిచేయటం, శత్రు సాయుధ బలాల్లో భాగంగా ఉన్న వారి యెడ ఒక వైఖరి, నిరాయుధులైన శత్రువుల యెడ మరొక వైఖరి – ఈ విధంగా అత్యున్నతమైన సంస్కృతి, నీతి సూత్రాలు ఏర్పడిన దశ అది. నూతన ప్రజాతంత్ర సంస్కృతి అంటే పుస్తకాలలో చదివి నేర్చుకొనేదేకాక 1947 సెప్టెంబర్, అక్టోబర్ నుండి మొదలుకొని 1948 సెప్టెంబర్ నాటి వరకు అమలు జరిపిన సంస్కృతి ఒకటి ఆచరణాత్మకంగా రూపొందింది అని గమనించాలి".

'ఈ కాలపు చివరి 3–4 నెలల్లో ఈ ఆర్థిక, రాజకీయ, మిలటరీ, సాంస్కృతిక వ్యవస్థకు ఒక స్వరూపమేర్పడింది. ఈ వ్యవస్థ అంతకుముందు రూపొందుతున్న దశలో ఉన్నది. అప్పటికి పోరాట ప్రాంతాలు గెరిల్లా ప్రాంతాల స్థాయిలోనే ఉండినవి. విముక్తి ప్రాంతం ఏర్పడలేదు. కనుక ఈ వ్యవస్థను సమగ్రంగా రూపొందించటానికి అవకాశం లేకుండినది. అయినా అలాంటి నూతన వ్యవస్థ ఆచరణలో ఏర్పడి రూపుదాల్చటానికి చాలా ప్రాముఖ్యత ఉంటుంది.'

'ఈ ఉద్యమంలో ఉన్న బలహీనతల గురించి కూడా అర్థం చేసుకోవాలి. ఈ బలహీనతల గురించి రెండు రకాల దృక్పథాలు ఇంతకుముందు నుండి ఉంటూ వచ్చాయి. పోలీసు చర్య జరగగానే ఈ పోరాటాన్ని ఉపసంహరించాలని అనేవారు. ఉద్యమంలో ముఖ్యాంశంగా ఉన్న విజయాలను తిరస్కార దృష్టితో హేయభావంతో చూచేవాళ్ళూ లేక వీటిని కనీస స్థాయికి తగ్గించ చూచేవాళ్లూ వున్నారు. 'వాస్తవంలో ఏదో కొంత జరిగింది. చాలా గొప్ప విషయాలే జరిగినవి, వాటిని వీర గాధల్లాగ చెప్పుకోవచ్చును. కాని ఇప్పుడు పోరాటాన్ని విరమిద్దాము; ఎందుకంటే నిలిచేదేమీ లేదు. మిగిలిందేమీ లేదు, అంతా ఖాళీ అయి పోయింది; ఇళ్ళకు చేరుకుందాము' అనే ధోరణి అప్పుడు వచ్చింది. పోలీసు యాక్షను తర్వాత పోరాటాన్ని విరమించాలనే పెద్దలు ఈ విజయాలను కనీసానికి తగ్గించి చూపెట్టి, తమ వాదనను బలపరచుకోవటానికి ప్రయత్నం చేశారు. పోలీసు యాక్షను జరగటం, పోరాటాన్ని విరమించటం, ఇదంతా జరిగి సుమారు 30–35 సంవత్సరాలు అయింది.'

'నేడు అదే పెద్దలు పోరాట విజయాలను ఆకాశానికెత్తి చూపెడుతూ, బలహీనతలను తగ్గించి చూపెడుతున్నారు. లేకుంటే బలహీనతలు దాదాపు ఏమీ లేనట్టుగా చూపెట్టుతున్నారు. ఈ విధంగా పోరాటాన్ని ఉపయోగించుకొని, తమ సంస్కరణవాద, పోరాట వ్యతిరేక, విప్లవ వ్యతిరేక అభిప్రాయాలను చలామణి చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. మొదటి నుండి విప్లవ వ్యతిరేకతను ప్రదర్శించ కుండా, **విప్లవ భావాలను, విప్లవ విజయాలను, విప్లవోద్యమాన్ని పొగడుతూ, దాని చాటున విప్లవ వ్యతిరేక అభిప్రాయాలను చలామణీ చేసుకోవటం చాలా తేలిక. మార్క్సిస్టు వ్యతిరేక భావాలను మార్క్సిజం పేరుతో ఈ రోజుల్లో చక్కగా చలామణి చేయవచ్చును. కానీ, మార్క్సిజం వ్యతిరేకత పేరుతో ఆ భావాలు చలామణీలోకి రావటం చాలా కష్టం. ప్రజల్లో, మేధావుల్లో మార్క్సిజం పట్ల అభిమానం చాలా ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో మార్క్సిజం పేరుతోనే మార్క్సిస్టు వ్యతిరేక అభిప్రాయాలను చలామణీ చేస్తున్నారు. అదేవిధంగా, ఈ రోజుల్లో విప్లవాలన్నా, విప్లవోద్యమాలన్నా ప్రజల్లో, మేధావుల్లో చాలా అభిమానం పెరిగింది. వాటిని నగ్నంగా, సూటిగా వ్యతిరేకిస్తే ఎవ్వరూ దాన్ని పట్టించుకోరు. అలాంటి వారిని విప్లవ వ్యతిరేకులని కొట్టి పారేస్తారు. వాటిని సూటిగా వ్యతిరేకించకుండా, పొగడుతూనే, విప్లవానికి అభిమానులుగా నటిస్తూనే, విప్లవ వ్యతిరేక అభిప్రాయాలు చలామణీ చేయటం సౌకర్యంగా ఉంటుంది. పూర్వపు విప్లవ వ్యతిరేక భావాలకు, ఈనాటి విప్లవ వ్యతిరేక భావాలకు ఉన్న ఈ మౌలికమైన భేదాన్ని గమనిస్తే విప్లవ కారులమని, లేదా విప్లవాన్ని అభిమానించే వారమని చెప్పుకునేవారు చాలామంది ఏ విధంగా విప్లవ వ్యతిరేకంగా పని చేస్తున్నారో, ఏ విధంగా వారి అభిప్రాయాలు విప్లవ వ్యతిరేకంగా మార్క్సిజం- లెనినిజానికి వ్యతిరేకంగా ఉన్నవో మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చును.'**

'ఆ కాలపు విజయాలను విమర్శనారహితంగా పొగడటం, బలహీనతలున్నాయని చెప్పినా వాటిని నామమాత్రమైనవిగా చెప్పి దాటవేయటం ఈ రోజుల్లో సర్వసాధారణంగా జరుగుతున్నది. విప్లవోద్యమాన్ని నిర్మిస్తున్న వారికి ఈ రకంగా దాటవేయడం వలన ఉపయోగముండదు. కాగా నష్టం చేస్తుంది. ఆనాడు చేసిన తప్పులను సరిగా అర్థం చేసుకొంటేనే తిరిగి వాటిని చేయటానికి

వీల్లేకుండా ఉంటుంది. అందుకొరకు ఆ తప్పులను నిశితంగా పరిశీలించి, అర్థం చేసుకోవాలి. వాటి నుండి గుణపాఠాలు తీసుకోవాలి. తిరిగి ఆ తప్పులు చేయకుండా ఉండటానికి తీసుకోవలసిన చర్యలన్నీ తీసుకోవాలి. అప్పుడే విప్లవద్యోమం సరైన పద్ధతిలో నిర్మాణమై ముందుకు సాగుతుంది.'

"ఈ దృష్టితో చూస్తే ఆ కాలంలో జరిగిన తప్పులు తక్కువేమీ కావు, కొద్దివేమీ కావు. వాటిని మనం జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ దశలో జరిగిన తప్పులలోని కొన్ని అంశాలను ఇక్కడ క్లుప్తంగా పేర్కొందాం.

ప్రధాన బలహీనతలు రాజకీయ విధానంలోనూ, మిలటరీ విధానంలోనూ ఇతర రంగాల్లోనూ కన్పిస్తాయి. ఇవి రూపొందించిన విధానాలలోనూ, అమలు జరిపిన తీరులోనూ కన్పిస్తాయి. ఆ రోజుల్లో ఒక స్పష్టమైన విధానం లేకుండా ఉండటం అన్నిటి కంటే ముఖ్యమైన బలహీనత. ఈ కాలంలో, పార్టీలో జోషీ విధానం పోయి, రణదీవే విధానం వచ్చింది. జోషీ విధానమున్నా, రణదీవే విధానమున్నా ఈ పోరాటం విషయంలోగానీ, ఈ పోరాటానికి సంబంధించిన నినాదాల విషయంలో గానీ ఒక స్పష్టమైన అవగాహన లేదు."

అంతేకాదు పార్టీ నిర్మాణం పార్టీ చైతన్యం గురించి దేవులపల్లి ఇంకా ఇలా అన్నారు;

"సాధారణ నిజాం వ్యతిరేకతను, పార్టీ చైతన్యాన్ని సమానం చేయటం, శిక్షణా విధానం లోపించటం; పార్టీ నిర్మాణంలో కొన్ని ముఖ్యమైన లోపాలే జరిగినవి. సర్వత్రా రాజకీయ శిక్షణ చాలా లోపించిందని చెప్పాము. నిజాం వ్యతిరేకత, పార్టీ చైతన్యం రెంటినీ సమానస్థాయికి తెచ్చారే గానీ, విడివిడిగా చూడలేకపోయారు. పార్టీ రాజకీయాలు లేని చదువుకున్న వారు కూడా అతివాద జాతీయ వాదులుగానో, ముస్లిం వ్యతిరేకులుగానో, నిజాం వ్యతిరేకులుగానో ఉండటానికి అవకాశమున్నది. మిలిటెంట్‌గా పోరాడటానికి అవకాశమున్నది. పోరాడారు కూడా, పార్టీ సభ్యులుగా ఉన్నటువంటి వారు పార్టీ కార్యక్రమాన్ని తెలుసుకోవటం, పార్టీ చైతన్యాన్ని అలవరచుకోవటం అవసరం. 'ఈ పోరాటం నిజాం వ్యతిరేక పోరాటమే కాదు. తర్వాత కూడా – దోపిడీ వ్యవస్థ అంతమయ్యే వరకూ కొనసాగవలసిన పోరాటం' అని అర్థం చేసుకొని దానికి సిద్ధమై ఉండటం – ఇది పార్టీ చైతన్యానికి ఆ రోజుల్లో గీటురాయిగా ఉంటుంది. కానీ అలాంటి చైతన్యాన్ని కలిగించటానికి, అలాంటి శిక్షణ ఇవ్వటానికి ప్రయత్నం దాదాపు జరగనేలేదని చెప్పాలి. సీనియర్ నాయకత్వానికి అంతకుపూర్వమే క్లాసుల ద్వారా, లేక పార్టీ సాహిత్యం ద్వారా పార్టీ విధానాలు తెలిసినందువలన వారికి కొంతవరకు అవగాహన ఉన్నదేకాని పోరాట కాలంలో వచ్చిన యువకులకు ఇటువంటి అవగాహన లేదు. ఆ విధంగా కొత్త నాయకత్వానికి అలాంటి రాజకీయ అవగాహన లేకుండా ఉండేది. నిజాం వ్యతిరేకతే అని అక్షరాలా అమలు జరిపారేగాని, రాజకీయదృష్టితో దాన్ని అమలు జరిపినది స్వల్పం. ఈ రకంగా రాజకీయ శిక్షణ, రాజకీయ స్థాయిలోపం మొదటి నుండే ఒక తీవ్రమైన సమస్యగా ఉండేది. పోరాటకాలంలో కూడా అదే విధంగా ఉండేది. నిజాం వ్యతిరేక ఐక్యతలో అనేక ఇతర శక్తులు – అతివాద జాతీయ వాదులు, జాతీయ విప్లవకారులు ఇతర శక్తులు కూడా ఉండటానికి అవకాశం ఉంటుంది. వీరితో పాటు చైతన్యం ఉన్న నాయకత్వ కామ్రేడ్సూ, సభ్యులూ ఉన్నారు. నాయకత్వంలో ఈ రెండు రకాల వారు కలిసి ఉండేది . దీనిలో జాతీయ విప్లవకారులు, ఇతరత్రా ఉన్నవారికి పార్టీ సిద్ధాంతాలను, పార్టీ విధానాలను బాగా వివరించి, నచ్చజెప్పి, నిజాం వ్యతిరేక పోరాటం వ్యవసాయ విప్లవ కార్యక్రమం కోసం పోరాటమనీ, ఈ పోరాటం తర్వాత నెహ్రూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవసాయ విప్లవ కార్యక్రమంతో సాయుధ పోరాటం సాగించ వలసి ఉంటుందనీ, దీనికి సంబంధించిన ఈ రాజకీయ అంశాలను ఆనాటి పార్టీ పాలసీమేరకైనా వివరించిన పాపాన పోలేదు. ఈ విధంగా చాలామంది నిజాం ప్రభుత్వం పోవటంతో విప్లవం, సాయుధ పోరాటం పూర్తవుతాయనే అవగాహన అస్పష్టంగా నైనా కలిగి ఉండటానికి దోహదం చేసింది. ఆనాటి పార్టీ శిక్షణా విధానం వలన, ఆ విధానం అన్న దానికన్నా అది లోపించటం వలన, ఇలాంటి పరిణామాలకు అవకాశం కలిగింది. ఇది తర్వాత కాలంలో చాలా నష్టాన్ని కలిగించింది."

(తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం –దేవులపల్లి వెంకటేశ్వరరావు – రచనాకాలం : 1980–83)

రష్యాలో సోషలిజం నిర్మాణమూ, రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ఫాసిజం ఓటమీ, తూర్పు యూరపులో శ్రామిక వర్గ రాజ్యాలు ఏర్పడటమూ, చైనాలో నూతన ప్రజాతంత్ర విప్లవం విజయపుటంచులకు చేరుకొని వుండటమూ అన్న సందర్భంలో భారత గడ్డపై విశాల ప్రాంతంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. అది నేటి విప్లవోద్యమాలకు అనేక విలువైన గుణపాఠాల నందిస్తున్నది.

కమ్యూనిస్టు పార్టీ మితవాద సంస్కరణ వాద పరిధి దాటి రివిజనిస్టు మార్గం – అంటే మార్క్సిజం – లెనినిజం ప్రాతిపదిక నుంచి విడిపోయి వాటిని తిరగతోడే సిద్ధాంతం ప్రవేశపెట్టింది. ఆచరించింది.

దీనికి వ్యతిరేకంగా 1955 నుంచి పోరాటాలు ప్రారంభమైనా అవి సంస్కరణవాద పరిధిలోపల విభేదాలుగానే అంతకుముందు బయటపడ్డాయి. అందుకే తిరిగి 1967 నుంచి సిపిఐ(ఎం) సిద్ధాంత వైఖరులపై పోరాటం ప్రారంభమయింది. వ్యవసాయ విప్లవం, జనతా ప్రజాస్వామ్య, శ్రామిక వర్గ నియంతృత్వ సిద్ధాంతాల నుంచి దూరమవుతూ వున్న పార్టీలో సిద్ధాంత, ఆచరణ రంగాలలో రెండింటా ప్రతిఘటన జరిగింది.

1967 నాటికే పశ్చిమబెంగాల్ డార్జిలింగ్ జిల్లాలోని నక్సల్‌బరీ ప్రాంతంలోని ఆదివాసీ రైతాంగం, కార్మికులు, ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలోని పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనోద్యమం, వరంగల్, ఖమ్మం జిల్లాలలో భూస్వామ్య వర్గాల దౌష్ట్యంపై ప్రజా పోరాటాలు సాగుతున్నాయి. ఇవి కమ్యూనిస్టు ఉద్యమంలోని సంస్కరణవాదం – రివిజనిజాలకు వ్యతిరేక పోరాటం పూర్తి కాలేదని చాటాయి.

ఎన్నికలనే పోరాట రూపం ప్రజా విప్లవ ఉద్యమంలో ఒకానొక సాధనం అనిగాక, అదే ప్రధాన పోరాట రూపమైంది. దాని దుష్ఫలితాలను కమ్యూనిస్టు పార్టీ అనుభవిస్తూ వుంది. పాక్షిక సమస్యలపై ఆందోళన, ప్రచారాలకు; అప్రయత్న పోరాటాలకు పార్టీ కుచించుకుపోయింది. పార్టీ నిర్మాణ దృఢత్వం లోపించింది. కామ్రేడ్ నాగిరెడ్డి 1969 మార్చిలో విదేశీ విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఇలా స్పందించారు:

“గత పదహారు సంవత్సరాలుగా మమ్ములను నిర్మాణ రహిత స్థితికి తీసుకొనిపోయిన మా స్వంత తప్పిదాలే సహజంగా మాకెదురవ్వబోయే ఇబ్బందులు, నిజంగా చెప్పాలంటే మేము విప్లవకర మార్గంలో కృషి చేయాలనుకొంటే మేముండి తీరవలసిన పద్ధతిలో మేము నిర్మాణయుతం చేయబడలేదు. మేము పార్లమెంటరీ చర్చల యెడల ప్రజలలో భ్రమలను సృష్టించాం. కమ్యూనిస్టు పార్టీ విప్లవ యంత్రాంగాన్ని పూర్తిగా పార్లమెంటరీ పంథాలో నిర్వహించాం. గత కాలపు క్రమశిక్షణ అంతరించింది. ఆనాటి నిస్వార్థపూరిత ధోరణి చెత్తబుట్టలోకి పోయింది. ఆనాటి కఠిన శ్రమ అదృశ్యమైపోయింది. ఒక విప్లవకారుడికి అవసరమైనదంతా అదృశ్యమై పోయింది. మేం పునర్నిర్మించుకోవాలి. ఇది మాకెదురయ్యే ఇబ్బందులలో కెల్లా గొప్పది.”

పార్టీకి నూతన రక్తాన్ని ఎక్కించే పని చేయాలి. సిద్ధాంత నిబద్ధత, ఆచరణలో నిబద్ధత లేకుండా విప్లవోద్యమ నిర్మాణం సాధ్యం కాదు. అలాంటి పార్టీ లేకుంటే వైఫల్యాలకు గురౌతూనే వుంటాం అన్నారు.

## నక్సల్బరీ సాయుధ ప్రతిఘటన

“1955లలో తెరాయి ప్రాంతంలో టీ తోటల కార్మికులు, రైతాంగం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సంఘటితం కావడం ప్రారంభమైంది. కార్మికులు, రైతులు దృఢమైన పోరాటాలు సాగిస్తూ వచ్చారు. పార్టీలోపల సిద్ధాంతపరంగా, రాజకీయపరంగా చర్చలూ, యుద్ధాలూ జరుగుతూ, ప్రజా ఉద్యమాలతో ఉద్రిక్తభరితంగా వుంది డార్జిలింగ్ జిల్లా. ఇంతటి నేపథ్యం మూలంగా – అనేక పరిణామ క్రమాల గుండా సాగుతూ వచ్చిన పోరాటాలకు సంబంధించిన గుణాత్మక చర్యగా నక్సల్బరీ ప్రాంతంలో 1967 మే 24న నక్సల్‌బరీ తిరుగుబాటు బద్దలయింది.

పార్టీ చరిత్ర–ఒక మదింపు అన్న వ్యాసంలో కామ్రేడ్ కానుసన్యాల్ ఇలా వివరించారు :

“వాస్తవికంగా అంచనా వేయాలంటే 1959 నాటి రైతాంగ ఉద్యమపు రోజుల్లోకి వెనక్కి వెళ్ళాల్సి వుంది. పశ్చిమబెంగాల్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం భూ పరిమితి చట్టం చేసిందనీ, ఉద్దేశపూర్వకంగానే ఆ చట్టంలో లొసుగులు వుంచటం ద్వారా రైతులకు భూమి లేకుండా చేయబూనుకొందనీ, అందరూ ఎరిగిన విషయమే. పశ్చిమబెంగాల్‌లోని రాష్ట్ర కిసాన్ కౌన్సిల్ (పశ్చిమబెంగాల్ రాష్ట్ర రైతు సమితి – సి.పి.ఐ కాలం నాటిది) భూస్వాముల బినామీ లావాదేవీలను నిలుపుదల కృషిని కొన్ని తేదీల్లో చేపట్టాలనే పిలుపునివ్వాలని నిర్ణయించింది. అంటే సిలిగురి కిసాన్ సభ (రైతు సభ) చట్టబద్ధత కాని ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. ఒకవేళ బినామీ బదలాయింపులు నిలుపుదల చేయాలంటే, అప్పుడే కేవలం సీలింగు చట్టం చేయబడ్డ పరిమితుల్లో గల భూమిని వదిలిపెట్టి వేయాల్సి వుంటుందనీ, సీలింగ్ చట్ట పరిమితులకు మించిన మిగులు భూములనే ఆక్రమించుకోవాలి అనీ రైతు సభ నొక్కి చెప్పింది. దీన్ని రాష్ట్ర కిసాన్ సమితి వ్యతిరేకించింది. అయి నప్పటికీ సిలిగురి కిసాన్ సభ బినామీ బదలా యింపుకు వ్యతిరేకంగా పోరాటాన్ని మొదలెట్టింది.

అధికారికంగా సమ్మె ఉపసంహరింపబడ్డా, భూమి కోసం పోరాటం ఆగిపోకుండా సాగింది. ఈ కాలం అంతా సంక్లిష్ట పరిస్థితులలో నిండి వుంది. చైనా వ్యతిరేక హిస్టీరియా, పార్టీలో చీలికలు అపారమయిన రాజకీయ సమస్యలను సృష్టించాయి. వీటికి తోడు కామ్రేడ్లపై ప్రభుత్వం దాడులు జరిపింది. రెండుసార్లు కామ్రేడ్లను జైళ్ళలోకి తోయటం జరిగింది. 1962–64 కాలంలో ఒకసారి, 1964 –66 కాలంలో ఒకసారి ఇలా జరిగింది. ఈ కాలంలో రైతులపైనా, తేయాకు తోటల కార్మికుల పైనా విస్తృతంగా దాడులు జరిగాయి. బహుశా దేశంలో మరే జిల్లాలోనూ యింత విస్తృతంగా దాడులు జరిగి వుండవు. భారత రక్షణ రూల్సు (డి.ఐ.ఆర్) క్రింద వందలమంది రైతు, కార్మిక నాయకులు అరెస్టు చేయబడ్డారు. ఈ కాలంలో ఒకవైపు కామ్రేడ్లు సి.పి.యంను పునర్‌నిర్మించాల్సి వచ్చింది. సాగుతున్న రైతు పోరాటాలను నిర్వహించి వాటి సమస్యలు పట్టించుకోవాల్సి వచ్చింది. మరోవైపు వారు నయా రివిజనిస్టులను ప్రతిఘటించడంతో పాటు, వామపక్ష తీవ్రవాద చీలిక బీజాలతో వ్యవహరించాల్సి వచ్చింది.

ఇవన్నీ కాక, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం అప్రతిహితంగా కొనసాగింది. ఈ కాలంలో ఒక ప్రత్యేకమయిన, పెనుభారమయిన, చాలా సంక్లిష్టమయిన పోరాటాన్ని సాగించాల్సి వచ్చింది. అటువంటి పరిస్థితిని చాలా మంది కామ్రేడ్లు ఎన్నడూ ఎదుర్కోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో మేధావి కామ్రేడ్ల కొరత వుంది. అందువలన వారు ప్రధానంగా తమ ఆచరణాత్మక అనుభవంపైననే ఆధారపడ్డారు. ఈ కాలంలో పరిస్థితి ఎలా వుంది అంటే కామ్రేడ్లు పోరాటాన్నైనా సాగించాలి. లేదా పోరాటాల్ని

వదిలి వెళ్ళిపోవాలి. ఇటువంటి పరిస్థితుల్లో కామ్రేడ్లు తిరిగి భూమిని ఆక్రమించుకోవటంతో ఆ ప్రాంతమంతా భూస్వాములు లేకుండా పోయారు. చిన్న భూస్వాములూ, ధనిక రైతులూ మాకు తమ హృదయ పూర్వక మద్దతును యిచ్చారు. భూస్వాముల గూండాల నుండి రైతులు తుపాకులు గుంజుకొన్నారు. 1966 డిసెంబరులో యిది జరిగింది.

మరొక ప్రాంతంలో ఉద్యమం యొక్క నాయకులు లేకుండా వున్న సమయాన్ని అదునుగా తీసుకొన్న ఒక తేయాకు తోట యజమాని 100 ఎకరాల భూమి నుండి రైతులను బలవంతంగా వెళ్ళగొట్టి, తేయాకు తోట కార్మికులు నివసించేందుకు 15 నివాసపు క్వార్టర్లను నిర్మించాడు.

సిలిగురి కిసాన్ సభ 2000 మందిని మించిన రైతులనూ, కార్మికులనూ కదిలించి ఆ పక్కా నివాస క్వార్టర్లను కూలద్రోసి, భూమిని స్వాధీనం చేసుకొంది. ఆ భూమి యిప్పటికీ ఆ ప్రాంతపు రైతుల స్వాధీనం లోనే వుంది. 1967 మార్చిలో ఈ ఘటన జరిగింది. ఒక మిలటరీ కాంట్రాక్టరు, క్యాంటీన్ యజమాని మరియు ఒక బడా భూస్వామికి వ్యతిరేకంగా భూమి కోసం జరిగిన పోరాటం కూడా చాలా ముఖ్య మయినది. ఎందుకంటే ఈ పోరాటం ఉత్తర బెంగాల్ యూనివర్సిటీ విద్యార్థులపై గొప్ప ప్రభావాన్ని కలుగ చేసింది.

1967లో ఎన్నికలు బహిష్కరణ నినాదం ముందుకు వచ్చింది. కామ్రేడ్ కానుసన్యాల్ అప్పటి వరకూ జైలులో వున్నారు. 1967 ఎన్నికలకు కొద్దికాలం ముందుగానే జైలు నుండి విడుదల చేయబడ్డారు.

1967 ఎన్నికలకు ఒకనెల ముందు కా॥ జంగల్ సంతాల్ కలకత్తా జైలు నుండి విడుదల కాబడ్డ అనంతరం, ఈ ఎన్నికల బహిష్కరణ విధానానికి వ్యతిరేకంగా పోరాడటం జరిగింది. ఈ వైఖరి నుండి కామ్రేడ్ చారుమజుందార్ వెను దిరిగాడు. భూమి కోసం పోరాటం కొనసాగుతూనే వుంది. కామ్రేడ్ జంగల్ సంతాల్ ఎన్నికలలో ఓడింపబడ్డారన్న విషయం కూడా కామ్రేడ్లు గుర్తు పెట్టుకోవాలి.

ఏమైనా 1967లో పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్ మంత్రివర్గం ఓడింపబడి ఐక్య సంఘటన మంత్రి వర్గం అధికారంలోకి వచ్చింది. ఈ కాలంలోనే కాంగ్రెసు ఎం.ఎల్.ఎ అయిన ఈశ్వర్ ట్రికే, కామ్రేడ్ బిగుల్ కిషన్‌ను తన బర్గ (కౌలు) భూమి నుండి తొలగించ ప్రయత్నించాడు. సహజంగానే భూస్వాములకు వ్యతిరేకంగా కోపం జ్వలించింది. అమర కామ్రేడ్ జంగల్ సంతాల్ ఈ భూమి నుండి తొలగింపుకు వ్యతిరేకంగా పోరాటాన్ని నడిపారు. ఇది మీడియా యొక్క ఆసక్తిని ఆకర్షించింది. ఎందుకంటే ఈశ్వర్ ట్రికే కేవలం ఒక కాంగ్రెసు ఎం.ఎల్.ఏ మాత్రమే కాదు, అతడు ఒక మాజీ ఉపమంత్రి కూడా.

డార్జిలింగు కొండలకు ముఖ ద్వారమయిన సుక్నా ఫారెస్టు బంగళాలో అధికార యంత్రాంగంతో మాట్లాడానికి కామ్రేడ్ కానుసన్యాల్, కామ్రేడ్ సౌరేన్ బోస్‌లు వెళ్లారు. భూ సంస్కరణల మంత్రి హెచ్.కె. కోనార్, పశ్చిమబెంగాల్‌కు చెందిన ఉన్నత పోలీసు అధికారులతో పాటు వారిని కలిశాడు. పోలీసులకు కావలసిన కామ్రేడ్లు అందరూ లొంగిపోవాలని వాళ్ళు డిమాండ్ చేశారు. ప్రతినిధి వర్గం వాళ్ళని భూస్వాములపై "ఎన్నో ఎఫ్.ఐ.ఆర్‌లు అప్పటికే వున్నా ఎందుకు మీరు వారిని అరెస్టు చేయలేదు" అని ప్రశ్నించారు. దానికి ఆ అధికారుల దగ్గర జవాబు లేదు. సహజంగానే అధికారులు ఇరుకున పడ్డారు. ఆఖరికి వారు తాము కావాల్సిన వ్యక్తుల జాబితాను కొద్ది రోజుల్లో యిస్తామనీ, ఆ జాబితాలో పేర్కొన్నబడ్డ వారు జట్లు, జట్లుగా తమకు లొంగి పోవాలనీ చెప్పారు. ప్రతినిధి వర్గం లొంగిపోవటానికి అంగీకరించకపోవటంతో సంభాషణలు భగ్నం అయ్యాయి. ఆ తర్వాత పోలీసు క్యాంపులను కనుక ఉపసంహరిస్తే, ఒక నిర్ణయింపబడిన అజెండాపై మాట్లాడటానికి మేము సిద్ధంగా వున్నామని ప్రతినిధి వర్గం మంత్రికి చెప్పింది. అంతిమంగా సంభాషణలు భగ్నమయ్యాయి.

8-10 రోజుల తర్వాత ఒక పెద్ద పోలీసు బలగం కామ్రేడ్లను అరెస్టు చేయటం కోసం బారారుఝూరు (నక్సల్‌బరీ నుండి 3 కిలోమీటర్ల దూరంలో వుంది) గ్రామంలోకి ప్రవేశించారు. పోలీసు బలగాలు స్థానిక గ్రామీణుల నుండి బలమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ వార్త యితర గ్రామాలకూ, చుట్టుపక్కల గల తేయాకు తోటలకు చేరింది. వేలమంది రైతులూ, కార్మికులూ ఆ ప్రాంతంలోకి వేగంగా చొరబడ్డారు. ఒక తీవ్ర ఘర్షణ జరిగింది. అందులో కొందరు పోలీసు అధికారులు గాయబడ్డారు. ఇన్‌స్పెక్టర్ వంగ్డీ చంప బడ్డాడు. ఈ ఘటన 1967 మే 24న జరిగింది, అంతవరకూ రాజకీయ ప్రచారం భూమికి అంటి పెట్టుకొని వుండి భూస్వాములను, పోలీసులనూ ప్రతిఘటించండి అని సాగుతోంది అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. సాంప్రదాయక ఆయుధాలతో పోలీసులను ప్రతిఘటించటం అన్నది ఇదే మొట్ట మొదటిసారి. ఈ సంఘటన పోరాటంలో ఒక గుణాత్మకమైన మార్పు. భూమి కోసం జరిగే పోరాటం ఒక ఉన్నత దశకు మలుపు తిరిగింది. అందువలన మే 24 యొక్క ప్రాధాన్యత యిందులో వుంది. కనుక మే 24న నక్సల్‌బరీ దినాన్ని పాటించాలి. మే 25న, నక్సల్‌బరీకి దక్షిణాన 2 1/2 కి.మీ దూరంలో గల ప్రాసాదు జోతెలో రోడ్డు ప్రక్కన చాలా మంది మహిళా కామ్రేడ్లు ఒక జనరల్ బాడీ సమావేశం జరుపుకొంటున్నారు. సబ్ డివిజనల్ ఆఫీసరు, పోలీసు బలగాలతో ఆ చోటుకు వచ్చి ఆగారు. తక్షణం మహిళా కామ్రేడ్లు వారందరినీ చుట్టుముట్టి నిరాయుధులను చేయ ప్రయత్నించారు. వాస్తవంగా, పోలీసులు తక్కువ సంఖ్యలో వుండటం వలన వారిని నిరాయుధులను చేశారు. అప్పుడు సబ్ డివిజన్ ఆఫీసరు పురుష కామ్రేడ్లలో ఒకర్ని పిలిచి, తమను వదిలిపెట్టాల్సిందిగా కోరాడు. అందుకు పురుష కామ్రేడు అంగీకరించి, ఎస్.డి.వోనూ పోలీసులనూ వెళ్ళిపోవాల్సిందిగా మహిళా కామ్రేడ్లకు చెప్పారు.

పోలీసులు తమ ఆయుధాలతో ఆ చోటును వదిలిపెట్టి కొన్ని గజాల దూరంలో ఆగారు. అక్కడి నుండి తుపాకులు బారుగా గురిపెట్టి ఆ మహిళలపై కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో 11 మంది మహిళా కామ్రేడ్లు, ఒక పసిబిడ్డా చంపబడ్డారు. వాస్తవంగా మే 25న పోలీసులు తమ కక్ష తీర్చుకొన్నారు. మే 24 తర్వాత, ఈ ఘటన ఐక్య సంఘటనా ప్రభుత్వాన్ని (దాని దుష్ట స్వభావాన్ని) బట్టబయలు చేసింది. ఈ రెండు ఘటనలూ పశ్చిమబెంగాలు అంతటా, దేశంలో ఆ చివరి నుండి ఈ చివరిదాకా ఒక గొప్ప కుదుపును (కలకలాన్ని) సృష్టించాయి. అందువలన మే 25 అమరవీరుల దినమయింది. విప్లవకర భూ సంస్కరణలు అంటే వ్యవసాయిక విప్లవాన్ని గురించిన అంశం పట్ల పార్లమెంటరీ పంథా ఎంతటి బూటకమయిందో, మోసపూరిత మైనదో ఇది (ఈ ఘటన) బట్టబయలు చేసింది. అందువలన కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక మారు మూల ప్రాంతమయిన నక్సల్‌బరీ ఒక మూల మలుపు అయ్యింది. నక్సల్‌బరీ పోరాటాన్ని సమర్ధించటం కమ్యూనిస్టు విప్లవకారుల చిహ్నంగా మారింది. అదే సందర్భంలో నక్సల్‌బరీ పోరాటాన్ని వ్యతిరేకించటం అంటే బూర్జువా, భూస్వామ్యవర్గ వ్యవస్థ పక్షం వహించటం, వారి సరసన చేరటం అయింది. ఎన్ని దుర్మార్గమయిన దాడులను ఐక్య సంఘటనా ప్రభుత్వం సాగించినా 1967 సెప్టెంబరు వరకూ నక్సల్‌బరీ పోరాటం అప్రతిహితంగా కొనసాగింది.

నక్సల్‌బరీ పోరాటానికి సంబంధించి మరికొన్ని ఉదంతాలను ప్రస్తావించాల్సి వుంది. 1967వ సంవత్సరంలో జులై సెప్టెంబరు నెలల మధ్యలో గల కాలం నక్సల్‌బరీ పోరాటానికి చాలా కీలక మయినది. ఈ కాలంలో తిరిగి, పోలీసులు, పారా మిలటరీ దళాలు చుట్టుముట్టడం జరిగింది. పదే పదే లొంగిపొమ్మనే ప్రకటన, ఆకస్మికంగా కామ్రేడ్ జంగల్ సంతాల్‌ను అరెస్టు చేయటం అన్నవి నాయకత్వానికి సమస్యలను సృష్టించాయి. వాస్తవానికి కామ్రేడ్లు ఖోకన్ మజుందార్, జంగల్ సంతాల్, బాబూలాల్ విశ్వకర్మాకర్‌లు ఒక రైతు యొక్క గుడిసెలో ఆశ్రయం తీసుకున్నారు. పొదలుండటం వలనా, చిట్టడవి వుండటం వలనా, ప్రక్క తేయాకు తోటలుండటం వలనా, ఆ ప్రాంతం అనుకూలంగా వుంది. ఆ గుడిశ నుండి ఒకరి తరువాత ఒకరు వదిలి వెళ్లిపోవాలని కా॥ ఖోకన్ మజుందార్ సలహా ఇచ్చారు. ఆయన మొట్టమొదటిగా అక్కడి నుండి వెళ్ళిపోయారు. కానీ కామ్రేడ్లు జంగాల్ సంతాల్, బాబూలాల్ విశ్వకర్మాకర్‌లు గుడిసెకు కొద్ది దూరంలో అరెస్టు చేయబడ్డారు. ఇందువలన చాలా నష్టం జరిగింది.” **(పార్టీ చరిత్ర-ఒక మదింపు - రచనా కాలం : 2005)**

50 సంవత్సరాల క్రితం 1967లో జరిగిన నక్సల్బరీ పోరాటానికి 14 సంవత్సరాల నేపథ్యం వుంది. రివిజనిజం, నయా రివిజనిజం నుంచి, అతివాద పెడధోరణుల నుంచి విడగొట్టుకొని వ్యవహరించడానికి; 14 సంవత్సరాల వారి నిరంతరాయ వర్గ పోరాట ఆచరణ, అనుభవము నక్సల్బరీ కామ్రేడ్స్‌కి తోడ్పడింది. 1967 మే 24న జోతేదారులతో, రాజ్యాంగ యంత్రంతో తలపడటం అన్న విప్లవ చర్య రివిజనిస్టు, నయా రివిజనిస్టు, పార్లమెంటరీ పంథా నుంచి పెద్ద తెగతెంపు. నక్సల్బరీ గర్జన దేశం నలుమూలలకు పాకింది.

## శ్రీకాకుళ గిరిజన సాయుధ తిరుగుబాటు

శ్రీకాకుళం గిరిజన విప్లవోద్యమం కూడా సుదీర్ఘమైన అభివృద్ధిక్రమంలో సాగింది. 1959లో పని ప్రారంభించి, కమ్యూనిస్టులు విశాల ప్రాతిపదికపై గిరిజన సంఘాన్ని ఆర్గనైజ్ చేశారు. 10 కోర్కెల (భూమి, అప్పుల రద్దు, అటవీ సంపదను అనుభవించే హక్కు, వెట్టిచాకిరీ రద్దు మొదలైనవి) ప్రాతిపదికగా వివిధ పోరాట రూపాల్లోకి ప్రజలను కదిలించారు. ప్రజలు ఈ కోర్కెలలో చాలా వాటిని సాధించుకున్నారు. 1967 జూన్ నాటికి ఈ ఉద్యమం ఒక నూతన స్థాయికి చేరుకొంది. ప్రజలు భూస్వాముల అక్రమ అధీనంలో గల భూమిని ఆక్రమించుకొంటూ ముందుకు కదిలారు. వారి పశువులను తదితరమైన వాటిని కూడా పంచు కున్నారు. భూస్వాములు, షావుకార్లు వారి ధాన్యాన్ని ఎగుమతి చేయకుండా అడ్డుకుని వాటిని చౌకధరకు పంచుకున్నారు. ఇదంతా ప్రజా వెల్లువకు కొత్త వూపును తెచ్చింది.

పెరుగుతున్న ఈ ప్రజా వెల్లువ చూసి భయపడిన భూస్వాములు, వారి గూండాలు గిరిజనులపైన 1967 అక్టోబరు 31న ఆకస్మిక దాడి చేశారు. ఇద్దరు గిరిజన కార్యకర్తల్ని వారు తుపాకులతో నేలకూల్చారు. మంగన్న, కోరన్నలు ఈ పోరాటపు మొట్టమొదటి అమరవీరులయ్యారు. కొద్దికాలం తర్వాత గిరిజనులు అమరవీరుల జ్ఞాపకార్థం తమ కార్యక్రమంలో భాగంగా మరలా పెద్ద ఎత్తున కదిలారు. భూస్వాముల అక్రమ అధీనంలో వున్న భూముల నుండి పంటలను స్వాధీనం చేసుకోటానికి, అప్పులను రద్దు చేయటానికి తదితర సమస్యలపైన వారు కదిలారు. ప్రజలు తమ సాంప్రదాయక ఆయుధాలతో ప్రదర్శనలు నిర్వహించడం మామూలు క్రమంగా తయారైంది. వారు విప్లవ సంస్కరణలకు పూనుకొన్నారు. గిరిజన సంఘం తన అధికారాన్ని నెరిపింది.

ఆ ప్రాంతంలో 1968 ఫిబ్రవరి 20వ తేదీన ప్రత్యేక సాయుధ పోలీసు శిబిరం నెలకొల్పబడింది. మార్చి 3న పెద్ద ఎత్తున దాడులు ప్రారంభమైనాయి. పోలీసులు అనేక మంది గిరిజనులను అరెస్టు చేశారు. స్త్రీలను అవమానపర్చారు. ప్రజల ఆస్తులను లూటీ చేశారు. ప్రజలకు పోలీసులకు మధ్య జరిగిన సాయుధ సంఘర్షణలో మరో ఇద్దరు గిరిజనులు చనిపోయారు. ఈ సందర్భంలో పరిస్థితిని ఎదుర్కొనేందుకు తగినంతగా సన్నద్ధమై లేనందు వల్ల ప్రజలు నిర్మాణయుత ప్రతిఘటన సాగించలేక పోయారు.

రాష్ట్ర నాయకత్వ గైడెన్స్ క్రింద, డి.సి. మార్చి 29న కొన్ని చర్యలు తీసుకోవటానికి నిర్ణయించుకొంది.

1. పార్టీ కార్యకర్తలు ప్రజలతో తమ సంబంధాలను పునరుద్ధరించుకొని పోలీసులు చిన్నాభిన్నం చేసిన తమ సాధారణ జీవితాన్ని వ్యవసాయ కార్యకలాపాలను పునరుద్ధరించుకోవటం, ప్రజలను కదిలించడం;

2. సాయుధ పోరాటానికి అవసరమయిన నిర్మాణ, రాజకీయ, సాంకేతిక సన్నాహాలు పూర్తి చేయటం.

3. జిల్లాలోని మిగతా ఏజెన్సీ ప్రాంతాలకు, అంతేగాక ఒరిస్సా ఏజెన్సీ ప్రాంతాలకు కార్యకలాపాల్ని, ఉద్యమాన్ని విస్తరించటానికి సాధ్యమయిన అన్ని చర్యలు తీసుకోవటం. ఆ సమయంలో, ఉద్యమం కొద్ది ప్రాంతానికి పరిమితమై వుందని రాష్ట్ర నాయకత్వం గట్టిగా నొక్కి చెప్పింది. సీతంపేట, పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతాలు రెండూ కలిపినా చిన్నవే, వాటి చుట్టూ రోడ్లు వున్నాయి. శత్రువు యొక్క పెనుదాడుల నుండి గెరిల్లా దళాలు తట్టుకొని నిలబడటం దాదాపు అసాధ్యమవుతుంది'. (ఏ.పి.సి.సి.ఆర్ సమీక్ష)

అయినప్పటికీ, అప్పటికే అఖిల భారత స్థాయిలోని అతివాద అవకాశవాద నాయకత్వం జిల్లా కమిటీ నాయకత్వంలోని ఒక సెక్షను రాష్ట్ర నాయకత్వ గైడెన్స్ యెడల పట్టీపట్టని, నిరాసక్త, మాటవినని ధోరణులు పెంచుకొని ఎపిసిసిసిఆర్ నుండి చీలిపోయి నేరుగా ఎఐసిసిసిఆర్‌లో చేరి పోయేదాకా వెళ్ళింది. రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వంలోని ఒక సెక్షనుకు అగాధం పెరిగింది. ఈ అగాధం ఏర్పడటానికి అఖిలభారత స్థాయిలోని అతివాద,అవకాశవాద ధోరణి బాగా దోహదపడింది.

శ్రీకాకుళం గిరిజనోద్యమం మిలిటెంటు ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంగా అభివృద్ధి చెందింది. ప్రజాయుద్ధ పంథా రాజకీయాలు ప్రవేశించడం, కమ్యూనిస్టు విప్లవకారులు కృషిచేయడంతో యిది విప్లవ స్వభావాన్ని సంతరించుకొన్నది. ఉద్యమాన్ని ఉన్నత స్థాయికి – ప్రజా సాయుధ పోరాట స్థాయికి – తీసుకొని వెళ్ళడానికి పరిస్థితులు త్వరితగతిన పరిపక్వం కాజొచ్చాయి. ఐనా, ఉద్యమంలో అధిగమించవలసిన బలహీనతలు వున్నాయి. ఉద్యమం ఆనాడున్న పరిస్థితిలో, విప్లవోద్యమ ఫలితాలను పరిరక్షించుకొనడానికి సాధ్యమైన, అవసరమైన అన్ని చర్యలూ తీసుకొంటూనే శత్రువు కన్నుగప్పి మసలడానికి, ఉద్యమాన్ని, మన కార్య కలాపాలను సాధ్యమైనంత విశాల ప్రాంతాలకు విస్తరింపజేయడానికి, వ్యవసాయ విప్లవోద్యమానికి, సాయుధ పోరాటానికి సాధ్యమైనంత విస్తృతమైన మద్దతును, సంఘీభావాన్ని సమీకరించుకొనడానికి సాధ్యమైనంత హెచ్చు సమయాన్ని సంపాదించు కొనడానికి తోడ్పడే ఎత్తుగడలను నాయకత్వం అనుసరించి వుండాల్సింది. చట్టబద్ధ – చట్టబద్ధంకాని, పోరాట, నిర్మాణరూపాలను జోడించి వుండాల్సింది.

అతివాద అవకాశవాద ధోరణి యొక్క వత్తిడి ఆనాడు ఎంత బలంగా వుందంటే, ఏపిసిసిసిఆర్ నాయకత్వంలోని ఒక భాగం కూడా అతివాద అవకాశవాద ధోరణి వైపు మొగ్గుచూపటమో లేదా ఆకర్షితులవటమో జరిగింది; యిది అతివాద అవకాశవాద నాయకత్వం యొక్క రాజకీయాలకు, కార్యాచరణకు వ్యతిరేకంగా రాజీలేని, నిర్ణయాత్మక పోరాటాన్ని సాగించపూనుకున్న నాయకత్వంలోని వారి శక్తిని ఎంతగానో బలహీనపరచింది.

ఈ కాలంలో దేబ్రా గోపీ వల్లభపూర్ కూడా ముఖ్యమైన పోరాటమే. అది దీర్ఘకాలిక ప్రజల సాయుధ పోరాటంగా అభివృద్ధికాగల లక్షణాలను, శక్తిని ప్రదర్శించింది. 1969 నాటికి ఈ ఉద్యమం వివిధ పోరాట రూపాలగుండా పయనించి ఉన్నత స్థాయికి చేరుకొంది. వేలాది రైతులు పంటలను స్వాధీనం చేసుకోవటానికి కార్యాచరణలోకి దిగారు. అయితే, సి.పి.ఐ. (ఎం.ఎల్) అతివాద అవకాశవాద నాయకత్వం ఈ పంటల స్వాధీన ఉద్యమాన్ని 'పచ్చి రివిజనిజం'గా ఖండించారు. అపుడు వ్యవసాయ విప్లవోద్యమ కర్తవ్యాన్ని వదలిపెట్టి, 'నిర్మూలనా పంథా'ను ఆచరణలో పెట్టారు.

**వైఫల్యాల క్రమంలో పొరపాట్లకు కారణాల గురించి:**

కామ్రేడ్ సౌరెన్ బోసు రెండవ విడత 1970లో చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకులను కలసినపుడు కామ్రేడ్ కాంగ్‌షెంగ్ కామ్రేడ్ బోసుతో ఇలా అన్నారు:

"1968లో కామ్రేడ్ బోసును కలసినపుడు ఈ సమస్యపై నొక్కి చెప్పాను. ఆ చర్చల క్రమంలో నేనిలా చెప్పాను. విశాల ప్రజా బాహుళ్యానికి సంబంధం లేకుండా వేరుపడిపోయిన రీతిలో మనం సాయుధ పోరాటం సాగించినట్లయితే ఈ తరహా పోరాటం విజయవంతం కాజాలదు. రైతాంగ మౌలిక ప్రయోజనాలను, రైతాంగం యొక్క వ్యవసాయ విప్లవ పోరాటాన్ని మనం విస్మరించినట్లయితే ఈ సాయుధ పోరాటానికొక ప్రాతిపదిక వుండదు. అందువలన అది విజయవంతం కాజాలదు. ప్రజల చైతన్యం ఎల్లప్పుడూ క్రింది స్థాయి నుండి ఉన్నత స్థాయికి అభివృద్ధి చెందుతుందనీ, వారి ముఖ్య ప్రయోజనాలతో అంటే వారి ఆర్థిక ప్రయోజనాలతో మనం ప్రారంభించినపుడు మాత్రమే సాయుధ పోరాటానికి విశాల ప్రజాబాహుళ్యాన్ని సన్నద్ధం చేయగలమనీ, వారి చైతన్యస్థాయిని అభివృద్ధి చేయగలమనీ నేను చెప్పాను. ప్రజల నుండి మనం వేరుపడే పద్ధతిలో సాయుధ పోరాటానికి ప్రజలను మనం సన్నద్ధం చేయలేం"

("1970 అక్టోబరులో కా॥ చౌ–ఎన్–లై, కాంగ్‌షెంగ్‌ల సంభాషణ" అనే పుస్తకం నుండి)

1970 అక్టోబరులో కా॥ చౌ–ఎన్–లై, కాంగ్‌షెంగ్‌లు సిపిఐ (ఎం.ఎల్) ప్రతినిధిగా కలిసిన సోరేన్ బోసుతో వివరమైన చర్చ జరిపారు. వారి సంభాషణలో సిపిసి నాయకత్వం యిలా స్పష్టం చేసింది.

1. నేటి ప్రపంచంలో ఆధిక్యత గల లేదా నాయకత్వం వహిస్తున్న లేదా పితృస్వభావం గల పార్టీ లేదు. ప్రతి పార్టీ స్వతంత్రమైనది. అది మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని తన స్వంత విప్లవపు నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకోవాలి. తన

స్వంత తప్పులకు, వైఫల్యా లకు, విజయాలకు తానే బాధ్యత వహించాలి. మావో బోధనలను, చైనా అనుభవాలను కాపీ కొట్టడంగాని, యాంత్రికంగా అన్వయించడంగానీ సవ్యమైనదికాదు.

2. " చైనా ఛైర్మనే మా ఛైర్మన్" అని చెప్పడం అన్ని విధాలా తప్పు.

3. రైతాంగ పోరాటం భూమికోసం కాదు. రాజ్యాధికారం కోసం మాత్రమేనని చెప్పడం తప్పు. రెండూ పరస్పర సంబంధం గలవి, విడదీయరానివి.

4. ప్రజా ఉద్యమాలు, ప్రజాసంఘాలు గెరిల్లా యుద్ధానికి అడ్డంకులని చెప్పడం తప్పు. తద్విరుద్ధంగా అది లేకపోవడమే గెరిల్లా యుద్ధాన్ని ఆర్గనైజ్ చేసి నడిపే మార్గానికి అడ్డంకి.

5. నిర్మూలనా పంథా తప్పు. అటువంటి చర్యలు వినాశకరమైనవని చైనా విప్లవంలో రుజువైంది.

6. గెరిల్లా దళాలను ప్రజలతో సంబంధం లేకుండా రహస్యంగా కుట్రపూరిత పద్ధతుల్లో ఏర్పాటుచేయటం తప్పు. అది కేవలం పార్టీని గెరిల్లా దళాలను ప్రజల నుండి వేరుచేసి ఓటమికి దారితీస్తుంది.

7. పట్టణాలలో విద్యార్థి రెడ్‌గార్డ్‌లను ఏర్పాటు చేయడం తప్పు. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను వదలిపెట్టడం తప్పు.

8. సి.పి.ఐ.(ఎం.ఎల్)కు వ్యవసాయ విప్లవ కార్యక్రమం లేదు. యిది తీవ్రమైన బలహీనత; వైఫల్యం, వ్యవసాయ విప్లవ కార్యక్రమంపై ఆధార పడిన వ్యవసాయ విప్లవోద్యమం లేకుండా దానిని సాయుధ పోరాటంతో జోడించకుండా ప్రజలను సాయుధ పోరాటానికి సన్నద్ధం చేయలేము. విప్లవం విజయవంతం కాజాలదు.

9. అధికారాన్ని హస్తగతం చేసుకొన్న తరువాత ఐక్య సంఘటన ఏర్పాటు చేయాలని చెప్పటం తప్పు. ఐక్య సంఘటన అనే భావన 'ఆచరణా విప్లవోద్యమ అభివృద్ధి క్రమమంతటా విప్లవకారుల పనికి మార్గదర్శకం' చెయ్యాలి.

10. శత్రువు రక్తంలో తమ చేతులు ముంచిన వారు మాత్రమే కమ్యూనిస్టులు అని చెప్పడం తప్పు.

11. సి.పి.ఐ.(ఎం.ఎల్) సాధారణ దృక్పథం సరిగ్గానే వుంది. దాని విధానాలు తప్పు. వాటిని సరిదిద్దుకోవలసిన అవసరం వుంది.

సి.పి.ఐ. (ఎం.ఎల్) నాయకత్వం, సిపిసి నాయకత్వం వెలిబుచ్చిన అభిప్రాయాల సారాంశాన్ని లోతుగా గ్రహించి వుంటే, తన స్వంత అభిప్రాయాలనూ, ఆచరణలనూ నిజాయితీగా, ఆత్మవిమర్శనా పూర్వకంగా పరిశీలించుకున్నట్లయితే, మావో ఆలోచనా విధానాన్ని, ప్రజా యుద్ధ పంథాను తాను అన్వయించుకొన్న తీరు అంతా తప్పనీ, అతివాద అవకాశవాదమనీ గుర్తించి, సరిదిద్దుకొని తిరిగి విప్లవ ప్రజా పంథాలోకి వచ్చివుండవలసింది.

యిక్కడ కొన్ని అంశాలను పరిశీలించుకోవాలి:

1. అతివాద అవకాశవాద నాయకత్వానికి వ్యతిరేకంగా, సి.పి.ఐ.(ఎం.ఎల్) లోపల సాగిన ఆంతరంగిక పోరాటం ప్రాముఖ్యత కలది. అది ఆహ్వానించదగిన పరిణామం. ఆచరణ నుండి నేర్చుకొని విప్లవ ప్రజాపంథా మార్గాన్ని స్వీకరించే హృదయపూర్వక ప్రయత్నాన్ని అది ప్రతిబింబించింది. అనుభవాల ప్రాతిపదికపై ప్రజాస్వామిక, నిష్పాక్షిక పద్ధతిలో ఆంతరంగిక చర్చలను నిర్వహించి వుంటే ఆఖరు క్షణంలోనయినా తన తప్పులను సరిదిద్దు కోవటానికి మొత్తం సిపిఐ(ఎం.ఎల్)కు ఎంతగానో తోడ్పడి వుండేది. కానీ అతివాద అవకాశవాద నాయకత్వం పూర్తి పెడసరి వైఖరినీ, సరిదిద్ద వీలులేని ధోరణినీ ప్రదర్శించింది. భిన్నాభిప్రాయాలను, శక్తులను అణగద్రొక్కటానికి అన్నిరకాల నిరంకుశ పద్ధతులకు తలపడింది.

2. సి.పి.ఐ. (ఎం.ఎల్) లోపలా, బయటా అతివాద అవకాశవాదానికి వ్యతిరేకంగా నిలచిన శక్తులు సంప్రదించుకొని సన్నిహితమైనవారితో భారత విప్లవ సమస్యలపై మరింత ఏకీకృత అవగాహనను పెంపొందించుకొని అతివాద అవకాశవాదానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాన్ని సాగించినట్లయితే, భారతదేశమంతటా విప్లవ ప్రజాపంథాననుసరించే శక్తులు మరింత గొప్పగా బలోపేతమై వుండేవి. విప్లవకారుల శిబిరంలో మొత్తం పరిణామాల క్రమంపై అది గొప్ప ప్రభావాన్ని కలిగించి వుండేది. కానీ, ఆనాడు ఆంధ్ర కమ్యూనిస్టు విప్లవకారులకు, సి.పి.ఐ. (ఎం.ఎల్) లోపల ఆంతరంగిక పోరాటం సాగిస్తున్న శక్తులకు మధ్య దూరం ఇంకా కొనసాగు తూనే వుంది. దీనితోపాటు భౌతిక సంబంధాలు లేకపోవటం తదితర అంశాల మూలంగా వారిమధ్య ఏర్పడి వున్న దూరంతోపాటు కమ్యూనిస్టు విప్లవకారులకు వ్యతిరేకంగా వ్యాపింపచేయబడి వున్న దురభిప్రాయాల విషం దాని వ్యతిరేక పాత్రను అది నిర్వహించింది.

3. సిపిసి నాయకత్వం చేసిన విమర్శలు, ఇచ్చిన సలహాలు భారత విప్లవకారులకు నిర్దిష్టమైన సహాయంగా లభించాయి. కానీ అత్యంత బాధాకరమైన వాస్తవమేమంటే, సిపిసి నాయకత్వాన్ని అత్యున్నతంగా గౌరవిస్తున్నామని చెప్పుకొనే అతివాద అవకాశవాద నాయకత్వం నిర్హేతుకంగానూ చడీ చప్పుడు కాకుండానూ సిపిసి విమర్శలను, సలహాలను చాప క్రిందికి నెట్టివేసి తన స్వంత పంథానే కొనసాగించింది. ఈ వాస్తవాలలో (సిపిసి) విమర్శలు, సూచనలు కొన్ని చాలా చాలా ఆలస్యంగానూ, కొంచెం, కొంచెంగానూ వెలుగు చూశాయి. ఈ వాస్తవాలను దాచడం లేదా అణచిపెట్టడం మూలంగా భారత విప్లవానికి అపారమైన హాని జరిగిందని గుర్తించాలి. సిపిసి విమర్శలను, సలహాలను వెంటనే ఒక పద్ధతిలో రిపోర్టు చేసి చర్చకు పెట్టినట్లయితే అతివాద అవకాశవాదానికి వ్యతిరేక పోరాటం మరింత శక్తివంతంగా తయారై వుండేది. సరియైన పంథా ప్రాతిపదికపై మొత్తం భారతదేశ విప్లవకారు

లందరినీ ఐక్యపరచే క్రమాన్ని మరింత శక్తివంతం చేసి వుండేది. ఈ అవకాశాన్ని మనం కోల్పోయాము. విప్లవకారులను, విప్లవోద్యమాలను ఐక్యం చేసే బాటలో మరిన్ని అడ్డంకులు, అవరోధాలు కల్పించబడ్డాయి.

"నక్సల్బరీపై మరికొంత వివరణ" యిలా చెప్పింది: పాలకవర్గాల మధ్య వైరుధ్యాలు, చీలికలు దేశవ్యాపిత అసంతృప్తి, నక్సల్బరీలో బలమైన ప్రజా పునాది తప్ప, నక్సల్బరీ పోరాట సమయంలో ఎర్ర ప్రాంతాల (మావో చెప్పినట్లుగా) ఉనికికి అవసరమైన ఇతర పరిస్థితులేవీ లేవు. దీనికి తోడు, కొత్తగా ఏర్పడిన ఐక్య సంఘటనా ప్రభుత్వంపై ప్రజలకు భ్రమలున్నాయి. డార్జిలింగ్, కలకత్తా మరికొన్ని జిల్లాల కార్యకర్తలు నయా రివిజనిస్టు నాయకత్వంపై తిరుగుబాటు చేసినప్పటికీ, సాధారణ సభ్యులు రివిజనిస్టు నాయకత్వం విషయంలో గందరగోళ స్థితిలో వున్నప్పటికీ తిరుగుబాటుకు అనుకూలంగా లేరు. స్వీయాత్మక ఎత్తుగడల తప్పులు, స్వీయాత్మక సన్నాహాలు చేయకుండా వున్నట్లయితే, సూత్రాల విషయంలో దృఢంగా వుంటూ విధానం విషయంలో నాయకత్వం పట్టువిడుపులు ప్రదర్శించి వున్నట్లయితే భారీ నష్టాలు జరగకుండా నివారించగలిగే వాళ్ళమని, ఉద్యమం కాపాడబడి వుండేదని చెప్పబడింది.

"నక్సల్బరీపై మరికొంత వివరణ" అనే ఈ నివేదిక నిస్సందేహంగా నక్సల్బరీ రైతాంగ విప్లవ ఉద్యమం వైఫల్యానికి గల కారణాలను గుర్తించ టానికి హృదయపూర్వకమైన ప్రయత్నం చేసింది. (రచనాకాలం : 1973-74)

రష్యా, చైనా కమ్యూనిష్టు పార్టీలు తమతమ విప్లవాలను విజయవంతం చేయడానికి సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ, ఉద్యమ సమస్యలపై ఎప్పటి కప్పుడు ఆంతరంగిక చర్చా పద్ధతిని అనుసరించాయి. తప్పుడు ధోరణులు, ఉద్యమానికి హాని కలిగించే ధోరణులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాయి.

భారత కమ్యూనిష్టు ఉద్యమంలో గూడ సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ ఉద్యమ సమస్యలపై అత్యంత తీవ్రమైన భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. తెలంగాణా, నక్సల్బరీ, శ్రీకాకుళం, ఖమ్మం, వరంగల్, గోదావరి ఉద్యమాలలో గూడ భిన్నాభి ప్రాయాలు తలెత్తాయి. ఈ విభేదాలు 1946-50ల నాటి తెలంగాణా రైతాంగ పోరాటంలో సంస్కరణ వాదానికి విప్లవవాదానికి మధ్య - విప్లవవాదానికి అతివాద ఒంటెత్తువాదానికి మధ్యగాని వ్యక్తమయ్యాయి. సంస్కరణవాదం-అతివాద ఒంటెత్తువాదం రెండూ మొదటిది మితవాద రివిజనిష్టు పోకడగానూ, రెండవది విప్లవాత్మకంగా కనిపించే అతివాద ఒంటెత్తువాదం, భీభత్సకర (టెర్రరిష్టు) పోకడగానూ పరిణామం చెందాయి. ఈ రెండు ధోరణుల ఆచరణ ఫలితాలు అంతిమ పరిశీలనలో ఒక్కటే. ఈ రెండు పోకడలకు వ్యతిరేకంగా నిశ్చయాత్మక దృష్టితో, విప్లవం యొక్క దీర్ఘకాల, సకల (ఓవరాల్) ప్రయోజనాల దృష్టితో, పట్టువిడుపులతో, కామ్రేడ్లీ స్పిరిట్‌తో, పరస్పరం - ఒకరినొకరు వినిపించుకొనే, పట్టించుకొనే వైఖరితో పార్టీలో ఆంతరంగిక చర్చలు జరగవలసి యుండేది. గ్రూపుల మధ్య చర్చలను విప్లవ సంస్థల మధ్య కామ్రేడ్లీగా చర్చించుకోవలసి యుండేది. అలా జరగక పోవడమన్నది విప్లవం కోసం పనిచేస్తున్న కార్యశీలురయిన కార్యకర్తల మధ్య, విప్లవ ఆకాంక్షతో ఉన్న వివిధ స్థాయిలలోని విప్లవ శక్తుల మధ్య, మానసికంగానూ, భౌతికం గాను అగాధ మేర్పడింది. ఈ అగాధాన్ని చరిత్రలో మన మన నిర్మాణాలను, ఉద్యమాలను వాస్తవిక దృష్టికోణం నుంచి సమీక్షించుకోవడం ద్వారానే పూడ్చుకోగలుగుతాం.

విమర్శనా పద్ధతిలోను, సమీక్షలు, విశ్లేషణలు చేయడంలోనూ,స్వీయాత్మక ధోరణులను వదిలిపెట్టి అభిమాన, దురభిమానాల కతీతంగా వున్నపుడే భారత కమ్యూనిష్టు ఉద్యమం తనకెదురవుతున్న అవరోధాలను అధిగమించగలుగుతుంది.

## శత వార్షికోత్సవాల గురించి అవహేళనలనవసరం.

అక్టోబర్ విప్లవ శతవార్షికోత్సవాలు ఎందుకంటే చరిత్ర ఇంకా ఆగిపోలేదు గనుక, విప్లవాలు తథ్యం గనుక, విప్లవశక్తులు విప్లవోద్యమంలో తలమునక లవుతున్నారు గనుక, ప్రజానీకం దోపిడీ వర్గం సృష్టిస్తూన్న సంక్షోభ సుడిగుండాలలో పెనుగులాడుతూ సంఘర్షణ సాగించుతున్నారు గనుక.

మార్క్సిజానికి వక్రభాష్యాలు చెప్పేవారూ విప్లవోద్యమంలో నుంచి ఒడ్డుకు చేరి మేమే సరిగ్గా వ్యవహరించామని, రంగంలో వున్న వారికి హితబోధలు చేసేవారూ, నిరాశావాదానికి గురయ్యి సంస్కరణ వాదం, మానవతావాదంతో సరిపెట్టుకొనేవారూ వున్నారు గనుక.

సామ్రాజ్యవాదులు, బడాబూర్జువావర్గాలు, వారికి చేరువైవున్న మేధావులూ మార్క్సిజానికి కాలం చెల్లిం దంటున్నారు. పెట్టుబడిదారీ విధానమే మానవ కళ్యాణానికి తుదిమెట్టని వాదిస్తూన్నారు - వారిని అనేక వేషధారణలతో సమర్ధించేవారూ సహకరించే వారూ చెలరేగివున్నారు గనుక. శ్రామిక వర్గ విప్లవ పోరాటాల స్ఫూర్తిని నెలకొల్పడం, వ్యాప్తి చేయటం అన్న బాధ్యత వున్నది గనుక కమ్యూనిస్టు విప్లవకారులు తమ విప్లవ కర్తవ్యంగా వాటి అనుభవాలను మరోసారి నెమరువేసుకొనడానికే ఈ శతవార్షికోత్సవాలు, వార్షికోత్సవాలు జరుపుతున్నారు.

oooooo